RNI No. APTEL/2009/28868

ప్రజల కోసం... ప్రజల పక్షాన...
నిజం మా నడవడి...

సిటిజన్ టైమ్స్

PEOPLE ISSUES OUR MISSION

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

తెలుగు దినపత్రిక



TRUTH BRINGS A BETTER SOCIETY

CITIZEN TIMES TELUGU DAILY

సంపుటి :18 | సంచిక : 348 | సంపాదకులు : కంచర్ల సందీప్ కుమార్ | ప్రచురణ : విశాఖపట్నం | 23-10- 2026 | పేజీలు : 8 | వెల : 2/- రూ ॥

VOLUME: 18 | ISSUE : 348 | EDITOR:KANCHERLA SANDEEP KUMAR | PUBLISHED: VISAKHAPATNAM | 23-10-2026 | PAGES: 8 | PRICE : 2/- RS

ప్రొటోకాల్ లేకుండా నేరుగా చంద్రబాబు నివాసానికి పవన్..

పరిషత్ పోరుపై కీలక మంతనాలు!

సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో హుటాహుటిన భేటీ

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల వ్యూహంపై ఇరువురు నేతల చర్చ

కూటమిలో సీట్ల సర్దుబాటు, నామినేషన్లపై కీలక నిర్ణయాలు

వైసీపీ ఎత్తుగడలను తిప్పికొట్టేందుకు ఉమ్మడి కార్యాచరణ

అమరావతి, సిటిజన్ టైమ్స్

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఊహించని, ఆసక్తికరమైన సన్నివేశం చోటుచేసుకుంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎలాంటి అధికారిక హంగు ఆర్భాటాలు లేకుండా అత్యంత సాధారణ వ్యక్తిలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసానికి చేరుకున్నారు. సైరన్ మోగించే కాన్వాయ్ గానీ, భద్రతా సిబ్బంది గానీ లేకుండా ఆయన నేరుగా సీఎం ఇంటికి వెళ్లడం అందరినీ ఆశ్చర్యపరిచింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్లపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసిన కొన్ని గంటల్లోనే ఈ భేటీ జరగడం రాజకీయ వర్గాల్లో తీవ్ర తరువాయి 2లో..

పండుగ సాయన్న తన పోరాటంతో

ఎందరికో ఆదర్శంగా నిలిచారు: సీఎం రేవంత్

హైదరాబాద్, సిటిజన్ టైమ్స్

భూస్వాములు, జమిందార్లపై పోరాటం చేసిన వ్యక్తి పండుగ సాయన్న ముదిరాజ్ అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తన పోరాటం ద్వారా ఎందరికో ఆయన ఆదర్శంగా నిలిచారని చెప్పారు. పండుగ సాయన్న జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తామని చెప్పారు. రవీంద్రభారతిలో నిర్వహించిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకల్లో సీఎం పాల్గొని మాట్లాడారు. దొరలు ఆక్రమించిన భూములను సాయన్న తన పోరాటంతో పేదలకు పంచిపెట్టారని కొనియాడారు. చరిత్ర పుటల్లో ఆయనకూ ఓ పేజీ ఉండాలన్నారు. ఆయన పోరాటాన్ని ఇప్పటికీ జానపదాలుగా పాడుకుంటారని సీఎం వివరించారు. "ట్యాంక్‌బండ్‌పై దొడ్డి కొమురయ్య, పండుగ సాయన్న విగ్రహాలు నిర్మిస్తాం. సర్వాయి పాపన్న, చాకలి ఐలమ్మ, కొండా లక్ష్మణ్ బాపూజీని స్మరించుకుంటున్నాం. అందెశ్రీ, గద్దర్‌కు అండగా నిలిచాం. కొడంగల్ నియోజకవర్గంలో అత్యధిక జనాభా ముదిరాజ్‌లదే. గతంలో నాకు వారు చేసిన సాయం ఎప్పటికీ గుర్తుంచుకుంటా. వారికి సంపూర్ణ న్యాయం చేస్తామని హామీ ఇస్తున్నా. మా ప్రభుత్వం వచ్చాక ముదిరాజ్ బిడ్డలకు అనేక అవకాశాలు కల్పించాం. నేను పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు మంత్రి వాకిటి శ్రీహరికి రాజకీయంగా అవకాశం కల్పించా. మిగతా తరువాయి 2లో..

స్థానిక ఎన్నికల వాయిదా..

ఈసీ నిర్ణయాన్ని గౌరవిస్తామన్న అధికార కూటమి

ఈసీ ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటామని స్పష్టీకరణ

వైసీపీ కుట్రల వల్లే ఎన్నికలు ఆగిపోయాయని ఆరోపణ

ఎన్నికలను అడ్డుకునేందుకు వైసీపీ 59 పిటిషన్లు వేసిందన్న కూటమి

పారదర్శకంగా ఎన్నికలు జరగాలన్నదే తమ లక్ష్యమని వెల్లడి



అమరావతి, సిటిజన్ టైమ్స్

ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉంటామని అధికార కూటమి పార్టీలు ప్రకటించాయి. ఈసీ ఏ నిర్ణయం తీసుకున్నా గౌరవిస్తామని స్పష్టం చేశాయి. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పేర్లతో బుధవారం ఓ సంయుక్త ప్రకటన విడుదలైంది. కుట్రల ద్వారా ఎన్నికలను అడ్డుకోవడమే లక్ష్యంగా వైసీపీ పనిచేస్తోందని ఈ ప్రకటనలో కూటమి పార్టీలు తీవ్రంగా ఆరోపించాయి. రాష్ట్రానికి కేంద్ర నిధులు సకాలంలో అందాలన్నా, అభివృద్ధి పనులు ముందుకు సాగాలన్నా ఎన్నికలు గడువులోగా పూర్తి చేయాలని తాము భావించినట్లు తెలిపాయి. ప్రజా సంక్షేమం, తరువాయి 2లో..

రాహుల్‌పై అమిత్ షా సెటైర్

న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ ఢిల్లీలో నిరసనలు జరుగుతున్న సమయంలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ విదేశీ పర్యటనకు వెళ్లడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇదే విషయాన్ని ప్రస్తావించారు. మరో 30 ఏళ్లపాటు తరువాయి 2లో..

ఫ్రాన్స్ వెళ్తున్నారా..? జాగ్రత్త

భారతీయులకు ఎంబసీ అడ్వైజరీ

న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

మౌలిక వసతుల లేమి, పెరుగుతున్న ధరల వంటి సమస్యలతో ఫ్రాన్స్ మండిపోడుతోంది. ఈ అశాంతియుత పరిస్థితులు, స్థానికంగా కర్ఫ్యూల నేపథ్యంలో భారతీయులు జాగ్రత్తగా ఉండాలని పారిస్‌లోని భారత ఎంబసీ హెచ్చరించింది. ఫ్రాన్స్‌లో నివసిస్తున్న, ఆ దేశం వెళ్లాలనుకుంటున్న ప్రయాణికులకు సూచనలు చేసింది. "నిరసన ప్రదేశాలు, జనాలు భారీగా గుమిగూడిన ప్రాంతాలకు వెళ్లొద్దు. ఎప్పటికప్పుడు స్థానిక ప్రభుత్వాలు ఇచ్చే తరువాయి 2లో..

ఎంత వరకైనా పోరాడదాం: జగన్

వైసీపీ ముఖ్య నేతలతో ఆ పార్టీ అధినేత జగన్ భేటీ

స్థానిక ఎన్నికలకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో చర్చ

చంద్రబాబు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా హింసకు పాల్పడుతోందని ఆరోపణ

అమరావతి, సిటిజన్ టైమ్స్

వైసీపీ అధినేత జగన్ పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా జరుగుతున్న హింస, అక్రమాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో ఈ భేటీ జరిగింది. చంద్రబాబు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా హింసకు పాల్పడుతోందని ఆరోపించిన జగన్, ప్రజాస్వామ్య పరిరక్షణకు తరువాయి 2లో..

దేశ ప్రయోజనాల కోసం ఏకతాటిపై నిలుద్దాం

రాజకీయ పార్టీలకు ప్రధాని మోదీ పిలుపు

న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

దేశ ప్రయోజనాలు, ప్రజా ఆకాంక్షలను నెరవేర్చేందుకు అన్ని రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి రావాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. మహిళా రిజర్వేషన్లతో ముడిపడిన డీలిమిటేషన్ బిల్లు ఆమోదానికి ప్రతిపక్షాల మద్దతు కోసం కేంద్రం ప్రయత్నిస్తున్న నేపథ్యంలో ప్రధాని వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఢిల్లీలో మంగళవారం జరిగిన దసరా వేడుకల్లో ప్రధాని పాల్గొని ప్రసంగించారు. దేశ శత్రువులను గుర్తించి, వారిని ఓడించడానికి ప్రజలంతా ప్రతినబూనాలని మోదీ పిలుపునిచ్చారు. మొదట దేశమే అనే భావనతో పనిచేయాలని సూచించారు. దేశానికి హాని తరువాయి 2లో..

కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు, లోకేశ్

దేశ భద్రత, ఐక్యత కోసం షా కృషి స్ఫూర్తిదాయకమని కొనియాడిన సీఎం

అమిత్ షాకు బర్త్‌డే విషెస్ తెలిపిన రాష్ట్ర మంత్రి నారా లోకేశ్

ఏపీకి అందిస్తున్న మద్దతుకు ధన్యవాదాలు చెప్పిన లోకేశ్

అమరావతి, సిటిజన్ టైమ్స్

కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా జన్మదినాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. దేశ భద్రత, అఖండత కోసం అమిత్ షా చేస్తున్న విశేష కృషిని ఈ సందర్భంగా వారు కొనియాడారు. ఈ తరువాయి 2లో..

ఏపీకి మరో తుపాను ముప్పు?

బంగాళాఖాతంలో అనుకూల పరిస్థితులు!

బంగాళాఖాతంలో కొత్తగా ఏర్పడిన వాతావరణ వ్యవస్థ

అండమాన్ సమీపంలో ఉపరితల ఆవర్తనం గుర్తింపు

అక్టోబర్ 23 నాటికి అల్పపీడనంగా మారే అవకాశం

పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ ఏపీ తీరం వైపు రావొచ్చని అంచనా

తుపానుగా మారితే కోస్తాంధ్రపై ప్రభావం చూపే సూచనలు

అమరావతి, సిటిజన్ టైమ్స్

బంగాళాఖాతంలో మరో తుపాను భయం నెలకొంది. ఈశాన్య రుతుపవనాల సమయంలో ఏర్పడే వాతావరణ మార్పులు, ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంత ప్రజలను మరోసారి ఆందోళనకు గురిచేస్తున్నాయి. అండమాన్ సముద్రంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం క్రమంగా తరువాయి 2లో..



ఎడిటోరియల్

జగన్.. క్రిమినల్ లిటిగెంట్

వైసీపీ అధినేత జగన్.. క్రిమినల్ లిటిగెంట్ అని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఇలాంటి వారి వల్ల ప్రజాస్వామ్యం కూడా ఖూనీ అవుతోందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలను అత్యంత పారదర్శకంగా ని ర్వహిస్తుంటే.. ఓర్చుకోలేక బెంగళూరు ప్యాలెస్‌లో కూర్చుని ఏపీలో విధ్వంసాలకు ప్లాన్ చేశారని దుయ్యబట్టారు. ఇలాంటి నాయకుడి వల్ల రాజకీయాలు భ్రష్టు పట్టి పోతున్నాయని అన్నా రు. ఈ సందర్భంగా తనకు ఎదురైన ఓ అనుభవాన్ని చంద్రబాబు పంచుకున్నారు. గతంలో తాను యూరప్‌లో పర్యటించినప్పుడు.. యువత రాజకీయాల్లోకి రావాలని ఆహ్వానించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. అయితే.. జగన్ వంటి నాయకులు ఉన్నంత వరకు తాము వచ్చేది లేదంటూ.. వారు చెప్పారని, ఏపీలో తమ బంధువులకు కూడా రాజకీయాలంటే ఆసక్తి ఉందని.. కానీ, జగన్ ను చూసి వారు రాజకీయాలంటేనే అసహ్యం వేస్తోందని అన్నారని చంద్రబాబు వివరించారు. తాజాగా పార్టీ నాయకులు, మంత్రులతో టెలీకాన్ఫరెన్సు నిర్వహించిన చంద్రబాబు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏ విధంగా ముందుకు సాగాలన్న విషయంపై దిశానిర్దేశం చేశారు. పల్నాడు, కడప, ప్రకాశం జిల్లాల్లో జరుగుతున్న ఘర్షణలను ఆయన ప్రస్తావించారు. ఇవన్నీ వైసీపీ చేస్తున్న ప్రయత్నాలేనని తెలిపారు. వారే విధ్వంసం సృష్టించి.. వారే కోర్టుకు వెళ్లే సంస్కృతి జగన్‌కు మాత్రమే ఉందన్నారు. ఏం జరిగిందని కోర్టుకు వెళ్లారో వారే చెప్పాలన్నారు. కడపలో ఎంపీ అవినాష్‌రెడ్డి, రాజంపేటలో ఎంపీ మిథున్‌రెడ్డిలు ఎలా బరితెగించారో కూడా అందరూ చూశారని.. ఎంపీలకు ఈ ఎన్నికలతో సంబంధం ఏంటని ఆయనప్రశ్నించారు. ఏదో విధ్వంసం సృష్టించి, రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం సృష్టించాలన్న ఏకైక లక్ష్యంతోనే ఇలా చేశారని అన్నారు. చివరకు సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను కూడా వక్రీకరించి.. ప్రభుత్వాన్ని బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. క్షేత్రస్థాయిలో వైసీపీ ప్రచారాన్ని అడ్డుకోవాలని నాయకులను, మంత్రులను సీఎం చంద్రబాబు కోరారు. ఎక్కడా తగ్గాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో కూటమిగానే నాయకులు ముందుకు వెళ్లాలని చంద్రబాబు మరోసారి చెప్పారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా నాయకు లు కలివిడిగానే ఉండాలని.. వ్యాఖ్యానించారు. క్షేత్రస్థాయిలో పార్టీ నేతలు అందరినీ కలుపుకొని పోవాలని అన్నారు. ఏకగ్రీవాల విషయం ఎలా ఉన్నా.. ప్రజలను కలుసుకుని ప్రభుత్వం చేసిన మంచిని వివరించాలనిసూపర్ సిక్స్ హామీలపై మరింత ప్రచారం చేయాలని చంద్రబా బు దిశానిర్దేశం చేశారు. అంతేకాదు.. మూడు పార్టీల నాయకులు కూడా ఐక్యంగా ప్రచారానికి వెళ్లాలన్నారు. గెలుపు అనేదిఏకపక్షంగా ఉండాలని.. ఎక్కడా ఉదాసీనత వద్దని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఎన్నికలు సజావుగా సాగడంతోపాటు.. ప్రజలు కూడా మెచ్చేలా ఉండాలని అన్నారు.

విదేశాల్లో ఉన్నారుగా.. నా మాటలు వినిపించవులే

ఆయన పార్టీ అధికారానికి దూరంగా ఉంటుందని జోస్యం చెప్పారు. "మీరు విదేశాల్లో ఉండటంతో నా మాటలు వినలేరని నాకు తెలుసు. మీరు ఎందుకు విదేశాలకు వెళ్తారో చెప్పరు. సరేలే.. అది మీ వ్యక్తిగతం. కానీ ఒకసారి దిల్లీకి తిరిగివచ్చిన తర్వాత నా మాటలు వినండి. మరో 30 ఏళ్ల వరకు మీరు అధికారంలోకి రారు" అని అమిత్ షా వ్యంగ్యాస్త్రాలు విసిరారు. అలాగే, దేశ రాజధానిలో నిరసనల గురించి అమిత్ షా స్పందించారు. నిరసనలు, ప్రదర్శనల వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని, రాజకీయ నాయకులు ప్రజాసంక్షేమంపై దృష్టిపెట్టాలని సూచించారు. " గుంపులుగా రావడం, రాజకీయ గారడీ వల్ల ప్రజాతీర్పును ధిక్కరించడం సాధ్యం కాదు. ఎన్నికల్లో గెలవాలంటే ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవాలి. మీరు ఎన్నికైన చోటల్లా సంక్షేమ పథకాలు అమలు చేయండి. లేదంటే మిగిలిన ప్రాంతాల్లో ఆనవాళ్లు లేకుండా తుడిచిపెట్టుకుపోతారు" అని విపక్ష పార్టీలకు సూచించారు. "రాహుల్‌జీ.. మీరు చొరబాటుదార్ల ఓట్లను కాపాడాలని అనుకుంటున్నారు కాబట్టే ప్రతిసారి 'ఓటు చోరీ' గురించి మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ దాని మిత్రపక్షాలు భాజపాపై ఓటు చోరీ ఆరోపణలు చేస్తున్నాయి. కానీ, ఆ పార్టీలు మాత్రం పలు రాష్ట్రాల్లో దశాబ్దాలుగా అధికారానికి దూరంగా ఉన్నాయి. భాజపా 30 ఏళ్ల పాటు అధికారంలో ఉంటుందని నేను చెప్పగానే.. వెంటనే ఓటు చోరీ అంటూ ఆరోపిస్తారు. అమిత్‌షాకు ఎన్నికల ఫలితాలు ముందుగానే ఎలా తెలుస్తాయని అడుగుతుంటారు. అమిత్ షా ఇక్కడే పుట్టారు. ఈ దేశంలోనే నివసిస్తున్నారు. ప్రతి ఆరు నెలలకోసారి విదేశాలకు వెళ్లాల్సిన అవసరం నాకు లేదు. నేను ఈ ప్రజల మధ్యే నివసిస్తున్నాను" అంటూ విపక్షాల నిరసనలకు అమిత్ షా కౌంటర్ ఇచ్చారు.

ప్రొటోకాల్ లేకుండా నేరుగా చంద్రబాబు నివాసానికి పవన్..

పరిషత్ పోరుపై కీలక మంతనాలు!

చర్చకు దారితీసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్లు వేయలేకపోయిన వారికి మరో 48 గంటల సమయం ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి (ఎస్ఈసీ) సుప్రీంకోర్టు సూచించడమే ఈ ఆకస్మిక సమావేశానికి ప్రధాన కారణం. ఈ ఆదేశాల నేపథ్యంలో రాష్ట్రంలో 19 మున్సిపాలిటీలతో పాటు జరగబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియపై ఎలాంటి ప్రభావం పడుతుందనే అంశంపై చంద్రబాబు, పవన్ లోతుగా చర్చించారు. న్యాయస్థానం ఆదేశాలను అమలు చేస్తూనే, ఈ పరిణామాన్ని అవకాశంగా తీసుకుని వైసీపీ చేసే రాజకీయ ప్రచారాన్ని ఎలా తిప్పికొట్టాలనే దానిపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా మంతనాలు జరిపినట్లు తెలుస్తోంది. ఈ భేటీలో ముఖ్యంగా పరిషత్ ఎన్నికలే ప్రధాన అజెండాగా నిలిచాయి. ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో టీడీపీ – జనసేన – బీజేపీ కూటమి అభ్యర్థుల మధ్య సీట్ల సర్దుబాటు, నామినేషన్ల ప్రక్రియలో అనుసరించాల్సిన వ్యూహాలపై వారు ఒక అవగాహనకు వచ్చారు. గతంలో మున్సిపల్ ఎన్నికల సమయంలో వైసీపీ సృష్టించిన నాటకీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి అలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పక్కా ప్రణాళికతో నామినేషన్ల ఘట్టాన్ని పూర్తి చేయాలని నిర్ణయించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించి, గ్రామ స్థాయిలో కూటమి ఓటు బ్యాంకును పటిష్ఠం చేసుకుంటూ మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ఉమ్మడి కార్యాచరణను ఖరారు చేశారు. డిప్యూటీ సీఎం హోదాలో ఉన్నప్పటికీ పవన్ కళ్యాణ్ కేవలం పార్టీ పనుల కోసమే ప్రొటోకాల్‌ను పక్కనపెట్టి వచ్చారని జనసేన వర్గాలు చెబుతున్నాయి. క్లిష్టమైన రాజకీయ పరిస్థితుల్లో అధికారిక హంగుల కన్నా, పక్కా వ్యూహంతో ముందుకు సాగడమే ముఖ్యమనే బలమైన సందేశాన్ని ఈ చర్య ద్వారా పవన్ తన శ్రేణులకు పంపించారు. ఈ భేటీ ద్వారా పరిషత్ ఎన్నికల్లో వైసీపీ ఎత్తుగడలను సమర్థంగా ఎదుర్కొనేందుకు కూటమి సిద్ధంగా ఉందని చంద్రబాబు, పవన్ స్పష్టం చేశారు. రానున్న 48 గంటల్లో ఎస్ఈసీ తీసుకునే నిర్ణయం, తదుపరి పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో కీలకం కానున్నాయి.

ఏపీకి మరో తుపాను ముప్పు?

బలపడి, అల్పపీడనంగా మారి తుపానుగా రూపాంతరం చెందే సూచనలు కనిపిస్తున్నాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ వ్యవస్థ ఆంధ్రప్రదేశ్ తీరం వైపుగా పయనించే అవకాశాలు ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వివరాల్లోకి వెళితే, అక్టోబర్ 22 ఉదయం 5:30 గంటల సమయంలో ఉత్తర అండమాన్ సముద్రం పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడినట్లు వాతావరణ నిపుణులు గుర్తించారు. ఈ ఆవర్తనం ప్రభావంతో అక్టోబర్ 23 నాటికి ఆగ్నేయ, తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఈ వ్యవస్థ పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ రానున్న రోజుల్లో మరింత బలపడనుందని అంచనా వేస్తున్నారు.

తుపానుగా మారే అవకాశాలు ఎంత?

సాధారణంగా అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య కాలాన్ని పోస్ట్-మాన్‌సూన్ సీజన్‌గా పరిగణిస్తారు. ఈ సమయంలో బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఏర్పడటం సాధారణమే. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు వెచ్చగా ఉండటం, వాతావరణంలో తగినంత తేమ ఉండటం వంటి అనుకూల పరిస్థితులు ఉంటే, ఈ అల్పపీడనాలు త్వరితగతిన వాయుగుండంగా, ఆపై తీవ్ర వాయుగుండంగా మారి తుపానుగా రూపాంతరం చెందుతాయి. ప్రస్తుతం బంగాళాఖాతంలో అలాంటి అనుకూల పరిస్థితులే ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అయితే, అల్పపీడనం ఏర్పడినంత మాత్రాన, ప్రతిసారీ అది తుపానుగా మారుతుందని చెప్పలేమని, దాని తీవ్రత, కదలికలను నిరంతరం గమనించాల్సి ఉంటుందని వారు విశ్లేషిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌పై ప్రభావం

ప్రస్తుత అంచనాల ప్రకారం, ఈ వ్యవస్థ పశ్చిమ వాయవ్య దిశగా కదులుతోంది. ఈ మార్గంలో ప్రయాణిస్తే అది ఆంధ్రప్రదేశ్ లేదా ఒడిశా తీరాల వైపునకు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఒకవేళ ఈ వ్యవస్థ తుపానుగా మారితే, దాని ప్రభావం ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాలపై స్పష్టంగా కనిపించవచ్చు. ముఖ్యంగా కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, గంటకు 100 కిలోమీటర్ల పైబడిన వేగంతో బలమైన గాలులు, సముద్రంలో అలల తీవ్రత పెరగడం వంటి పరిణామాలు సంభవించవచ్చు. ప్రస్తుతానికి తుపాను ఎక్కడ తీరం దాటుతుందనే దానిపై స్పష్టత లేనప్పటికీ, వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో తీరప్రాంత ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని, అధికారిక ప్రకటనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి బాలమిత్ర అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

సిటిజన్ టైమ్స్,కోహెడ, అక్టోబర్ 22:

హైదరాబాదులోని బాగ్ లింగంపల్లిలో బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షులు వలస సుభాష్ చంద్రబోస్ విలేకరులకు ప్రకటన విడుదల చేసి ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బాలల హక్కుల ప్రజా వేదిక ఆధ్వర్యంలో నవంబర్ 14 బాలల దినోత్సవ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 14 సంవత్సరాల వయసుగల విద్యార్థులకు 34 రంగాలలో ప్రతిభ కలిగిన వారికి రాష్ట్రస్థాయి బాలమిత్ర అవార్డులు ప్రధానం హైదరాబాదులో ఏర్పాటు చేస్తున్నట్టు విద్యార్థులు దాగి ఉన్న సృజలాత్మ శక్తిని వెలికి తీసేందుకు రాష్ట్రస్థాయిలో బాలమిత్ర అవార్డులు ఇవ్వనున్నట్టు బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్ తెలిపారు విజయదశమి శు భాకాంక్షలు తెలియజేశారు

విద్యార్థులు దరఖాస్తు చేసే వివిధ రంగాలు.

దేశభక్తి పాటలు. భరతనాట్యం. గిటార్. కీబోర్డు ప్లేయింగ్. ఫ్లూటు. పర్వతాహోరన. యోగా. చిత్రలేఖనం. కార్టూన్స్. కవిత్వం జానపద నృత్యం. జానపద పాటలు. మిమిక్రీ .మ్యాజిక్. సైకిలింగ్. వాలీబాల్. కబడ్డీ. కోకో బ్యాట్మెంటన్. చెస్. ఫుట్బాల్. రన్నింగ్. జాతీయ సమైక్యత శిబిరం.. కరాటే. కూచిపూడి. కోలాటం. తబలా. బతుకమ్మ.స్విమ్మింగ్. బాస్కెట్బాల్. స్కిటింగ్. .టెన్నిస్ . అర్చరి .ఈ రంగాలలో నైపుణ్యం గల విద్యార్థులకు వారి వద్ద ఉన్న మెరిట్ సర్టిఫికెట్లు ఆధారంగా మా బాలల హక్కుల ప్రజావేదిక రాష్ట్రస్థాయిలో బాలమిత్ర అవార్డులు ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు దరఖాస్తు చివరి తేదీ 5.11.2026 రోజు వరకు సాయంత్రం ఐదు గంటల వరకు స్వీకరించబడును కావున నైపుణ్యం గల విద్యార్థులు వారి వద్ద ఉన్న మెరిట్ సర్టిఫికెట్లు ప్రెస్ క్లిప్పింగ్ పాటు బయోడేటా దరఖాస్తు దారిని ఫోటో జత చేసి వారి దరఖాస్తును పోస్ట్ ద్వారా స్వీకరించబడును ఈ అడ్రస్ కు వలస సుభాష్ చంద్ర బోస్ రాష్ట్ర అధ్యక్షులు బాలల హక్కుల ప్రజా వేదిక ఇంటి నెంబర్ 2-92 గ్రామము. కూరెల్ల. మండలం కోహెడ. జిల్లా సిద్దిపేట .పిన్ నెంబర్ 505473 పంపించగలరు ప్రతిభగల విద్యార్థులను కోరుచున్నాము వారి వెంట బీసీ రాజ్యాధికార సమితి సీఈవో పి సరస్వతి భాగ్యమ్మ లోకేష్ రాజేశ్వరి బాలల హక్కుల ప్రజా వేదిక హైదరాబాద్ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

ఎంత వరకైనా పోరాడదాం: జగన్

న్యాయపోరాటం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. "చంద్రబాబు వ్యవస్థీకృతంగా, ఉద్దేశపూర్వకంగా హింసకు పాల్పడుతున్నారు. ప్రభుత్వాన్ని నడుపుతున్నవారే హింసకు పాల్పడటం ఎక్కడా చూసి ఉండం. పోలీసులను వాడుకుని ఈ దారుణాలన్నీ చంద్రబాబు చేయిస్తున్నారు" అని తీవ్ర స్థాయిలో విమర్శించారు. సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చినా క్షేత్రస్థాయిలో పరిస్థితి మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో వైసీపీ కార్యకర్తలు, నాయకులు ధైర్యం ప్రదర్శిస్తున్నారని జగన్ ప్రశంసించారు. "క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఘటనలపై ఆధారాల సేకరణ చాలా అవసరం. పటిష్ఠ ఆధారాలను కోర్టుల ముందు ఉంచడం ద్వారా న్యాయపోరాటం చేద్దాం. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎందాకైనా పోరాటం చేద్దాం" అని జగన్ పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు.

పండుగ సాయన్న తన పోరాటంతో ఎందరికో ఆదర్శంగా నిలిచారు

ముదిరాజ్ నేతలకు కూడా త్వరలో అవకాశాలు వస్తాయి. జనగణనలో కులగణన చేసి వందేళ్లలో ఎవరూ చేయని పనిని మా ప్రభుత్వం పూర్తిచేసింది. ఏడాదిలోనే కులగణన పూర్తిచేసి దేశానికే ఆదర్శంగా నిలిచాం. బీసీ డి నుంచి బీసీ ఏలోకి మార్చాలని ముదిరాజ్‌లు కోరుతున్నారు. బీసీ సామాజికవర్గాలకు న్యాయం చేయాలనేదే మా ప్రభుత్వం లక్ష్యం. ఎందరు ప్రధానులు మారినా ఎస్సీ కులాల వర్గీకరణ జరగలేదు. దాన్ని కూడా చేపట్టి దేశానికి ఆదర్శంగా నిలిచాం. గత ప్రభుత్వాలు ఇచ్చిన సంక్షేమ పథకాలను రెండింతలు పెంచి ఇస్తున్నాం. రాష్ట్రంలో 3.48కోట్ల మంది పేదలకు సన్న బియ్యం ఇస్తున్నాం. ఎల్‌నినో కారణంగా ఇవాళ మార్కెట్‌లో సన్నబియ్యం రేట్లు పెరిగాయి. అనేక మంది పేదలు రేషన్ సన్నబియ్యం తింటున్నారు. ఎన్నికల్లో అండగా ఉండండి.. మీకు ఏం కావాలో నేను చూసుకుంటా" అని సీఎం రేవంత్ అన్నారు.

స్థానిక ఎన్నికల వాయిదా..

రాష్ట్ర అభివృద్ధిపై వైసీపీకి ఏమాత్రం బాధ్యత లేదని, మొదటి నుంచీ స్థానిక ఎన్నికలను అడ్డుకునేందుకే ప్రయత్నిస్తోందని విమర్శించాయి. ఎన్నికలను నిలిపివేయడం కోసం వైసీపీ ఏకంగా 59 పిటిషన్లను కోర్టులలో దాఖలు చేసిందని, ఆ అడ్డంకులు తొలగి ఎన్నికల ప్రక్రియ మొదలయ్యే సమయంలో హింసను ప్రేరేపించిందని ఆరోపించాయి. ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో, నిజాయతీగా జరగాలన్నదే తమ లక్ష్యమని, ఈ ప్రక్రియకు పూర్తి మద్దతు ఇస్తామని కూటమి పునరుద్ఘాటించింది. రాజ్యాంగబద్ధంగా ఎన్నికలు జరిగి, సమర్థులైన నాయకులు ఎన్నికై, కూటమి ప్రభుత్వ ఫలాలు ప్రతి ఇంటికీ అందాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నాయి.

ఫ్రాన్స్ వెళ్తున్నారా..? జాగ్రత్త

అధికారిక అడ్వైజరీలను గమనించుకోండి. రవాణాకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోండి" అని ఎంబసీ సూచించింది. సంబంధిత వెబ్‌సైట్ల వివరాలు షేర్ చేసింది.

ట్రంప్‌పై మేక్రాన్ ఆగ్రహం..

తమ దేశంలో జరుగుతోన్న నిరసనలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మేక్రాన్ ఖండించారు (మ్మిఎతీశీఅ-ుతీబఎజూ). రాజకీయ లబ్ధికోసమే విదేశీ నేతలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఫ్రాన్స్‌లో హింసాత్మక ఘటనలకు అక్కడి ప్రభుత్వ వలస విధానాలే కారణమని ట్రంప్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. "అవొక మూర్ఖపు మాటలు. వాటికి ఎలాంటి ఆమోదయోగ్యత లేదు" అని మేక్రాన్ మండిపడ్డారు.

దేశ ప్రయోజనాల కోసం ఏకతాటిపై నిలుద్దాం

తలపెట్టే శక్తులు.. సమాజాన్ని విభజించాలని చూసేవారు.. మన సంస్కృతిని ద్వేషించేవారు.. వీరంతా దేశ శత్రువులేనని మోదీ పేర్కొన్నారు. "ఈనాటికీ సుపరిపాలనకు రామరాజ్యం విజయవంతమైన నమూనా. రామరాజ్యంలో ఎవరి పట్లా వివక్ష ఉండదు. అందరికీ సమాన అవకాశాలు, న్యాయం లభిస్తాయి. అధికారం అంటే పాలించడం కాదు.. ప్రజా సంక్షేమాన్ని చేకూర్చడం.. ఇదే శ్రీరాముడి ఆదర్శం. దసరా అనేది చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక. భారతీయ తాత్విక చింతనలో దసరా స్ఫూర్తి ఎప్పటికీ అంతర్భాగంగా ఉంటుంది. దసరా వేడుకలు దేశమంతటినీ ఏకం చేస్తాయి" అని మోదీ తెలిపారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు మనం రాముడి నుంచి స్ఫూర్తి పొందాలన్నారు.

కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు, లోకేశ్

మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. "అమిత్ షా గారి సమర్థవంతమైన నాయకత్వం, దేశ రక్షణ కోసం ఆయన పడుతున్న అలుపెరుగని తపన అందరికీ స్ఫూర్తిదాయకం. దేశ భద్రత, ఐక్యత పట్ల మీకున్న అంకితభావం ఎంతో ప్రశంసనీయం" అని పేర్కొన్నారు. అమిత్ షా నిండు నూరేళ్లూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, దేశానికి మరెన్నో ఏళ్ల పాటు సేవలందించాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ సైతం అమిత్ షాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "దేశాన్ని సురక్షితంగా ఉంచాలన్న మీ దృఢ సంకల్పం, సమైక్య భారతం కోసం మీరు చేస్తున్న నిరంతర కృషి లక్షలాది మందికి ప్రేరణగా నిలుస్తోంది" అని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, ఇక్కడి ప్రజలకు అమిత్ షా అందిస్తున్న అండదండలకు లోకేశ్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన పరిపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని, దేశ సేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం.. ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలి

మాధవధార జీవీఎంసీ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేసిన జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

సిటిజన్ టైమ్స్, విశాఖపట్నం, అక్టోబర్ 22:
పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించడంతోపాటు, వారు ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం చేసేలా అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. గురువారం విశాఖపట్నంలోని మాధవధార జీవీఎంసీ మున్సిపల్ హైస్కూల్‌ను సందర్శించిన ఆయన, పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా భోజనం నాణ్యత, పాఠశాలలో పరిశుభ్రత, విద్యార్థులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. భోజనం నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు. విద్యార్థులు సౌకర్యవంతంగా భోజనం చేసేందుకు అవసరమైన కనీస మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థులు భోజనం చేసే ముందు చేతులు శుభ్రంగా కడుక్కునేందుకు ప్రత్యేక వాష్‌బేసిన్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు అధికారులు నిరంతరం

పర్యవేక్షించాలని పేర్కొన్నారు. పర్యటనలో భాగంగా కలెక్టర్ విద్యార్థులతో మమేకమై వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులతో వివిధ అంశాలపై మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యా బోధన ఎలా సాగుతోంది, విద్యార్థులకు అవసరమైన ఇతర సౌకర్యాలు అందుబాటులో

ఉన్నాయా అనే విషయాలపై ఆరా తీశారు. విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు ఆరోగ్యకరమైన వాతావరణం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. ప్రేమ్ కుమార్, మండల విద్యాశాఖ అధికారి వేణుగోపాల్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

అప్పన్న స్వామి సేవకు రెండు బొలెరో వాహనాలు విరాళం

సిటిజన్ టైమ్స్, సింహాచలం, అక్టోబర్ 22:
సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా రెండు బొలెరో గూడ్స్ వాహనాలను విరాళంగా అందజేసింది. ఎస్‌బీఐ అమరావతి సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ సుశీల్ కుమార్ సౌజన్యంతో సమకూరిన వాహనాలను దేవస్థానానికి అప్పగించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన నిత్య సేవా కార్యక్రమాలు, సామగ్రి రవాణా అవసరాలకు ఈ వాహనాలను వినియోగించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి జల్లేపల్లి వెంకట్రావు తెలిపారు. స్వామివారి సేవకు వాహనాలను అందించిన ఎస్‌బీఐ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ఇన్‌ఛార్జి డిప్యూటీ ఇంజినీర్ రామరాజు, ఎస్‌బీఐ సింహాచలం బ్రాంచ్ మేనేజర్, ఆలయ సిబ్బంది, బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.

టీడీపీ ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థుల ఫారం--ఏ కలెక్టర్‌కు అందజేత

సిటిజన్ టైమ్స్, విశాఖపట్నం, అక్టోబర్ 22
విశాఖపట్నం జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసే టీడీపీ అభ్యర్థుల నియామకానికి సంబంధించిన ఫారం--ఏ అధికార పత్రాన్ని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. అభిషిక్త్ కిశోర్‌కు అందజేశారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు మంజూరు చేసిన ఫారం--ఏ అధికార పత్రాన్ని విశాఖపట్నం పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు చోడే పట్టాభిరామ్‌కు అందించగా, ఆయన అనుమతితో జిల్లా టీడీపీ కార్యాలయ కార్యదర్శి నెక్కంటి రూపసత్య వెంకటేశం, సీనియర్ నాయకుడు యర్నాగుల జగదీష్ గురువారం కలెక్టర్‌కు సమర్పించారు. ఎన్నికల ప్రక్రియలో పార్టీ అభ్యర్థుల అధికారిక గుర్తింపునకు ఈ పత్రం కీలకమని పార్టీ వర్గాలు తెలిపాయి.

ఎన్నికల వేళ ఎక్సైజ్ దాడులు.. 30 లీటర్ల నాటుసారా స్వాధీనం

సిటిజన్ టైమ్స్, పాడేరు, అక్టోబర్ 22:
అల్లూరి సీతారామరాజు జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం తయారీ, విక్రయాలపై ఎక్సైజ్ శాఖ తనిఖీలు ముమ్మరం చేసింది. అరకులోయ మండలం బోసుబెడ గ్రామంలో పాంగి కృష్ణ అనే వ్యక్తి వద్ద 30 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, అతడిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్. నమ్రత తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా అక్రమ మద్యం సరఫరా, పంపిణీపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రభావితం చేసేలా మద్యం పంపిణీకి పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో అరకులోయ మొబైల్ పెట్రోలింగ్ పార్టీ హెడ్ కానిస్టేబుల్ పి. శ్రీనివాసరావు, కానిస్టేబుల్ డి.ఎం. గౌరీశంకర్ పాల్గొన్నారు.

జీవీఎంసీపై కూటమి జెండా ఎగరడం ఖాయం

21వ వార్డులో ఇంటింటా ప్రచారం నిర్వహించిన చోడే పట్టాభిరామ్

విశాఖపట్నం, అక్టోబర్ 22 (సిటిజన్ టైమ్స్):
జీవీఎంసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి, జీవీఎంసీపై కూటమి జెండా ఎగురవేయాలని విశాఖ పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చోడే వెంకట పట్టాభిరామ్ పిలుపునిచ్చారు. జీవీఎంసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా 21వ వార్డు ఆదర్శనగర్‌లో స్థానిక కూటమి కార్పొరేటర్ అభ్యర్థి కాళ్ల లలిత శంకర్‌తో కలిసి ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టాభిరామ్, కాళ్ల లలిత శంకర్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదర్శనగర్‌లోని పలు ఇళ్లకు వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. రానున్న జీవీఎంసీ ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి కాళ్ల లలిత శంకర్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కూటమి అభ్యర్థులకు ప్రజల మద్దతు అందించాలని కోరుతూ ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు.అనంతరం చోడే వెంకట పట్టాభిరామ్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ చూసినా కూటమికి అనుకూలమైన వాతావరణం కనిపిస్తోందని అన్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి దోహదపడతాయని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల ఆశీస్సులతో 21వ వార్డులో కూటమి అభ్యర్థి కాళ్ల లలిత శంకర్ విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. జీవీఎంసీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. వార్డులో ప్రజలతో మమేకమవుతూ నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 21వ వార్డు టీడీపీ అధ్యక్షుడు సత్తిబాబు, జనసేన ఇన్‌ఛార్జి శ్రీనివాస్ పట్నాయక్, నాయకులు వర, రాము, కృష్ణ, పరమేశ్, గోపమ్మ తదితరులు పాల్గొన్నారు.

ది పార్క్ విస్టాలో అత్యంత వైభవంగా బెంగాలీ ఫుడ్ ఫెస్టివల్

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్ , అక్టోబర్ 22:
నగరంలోని ది పార్క్ విశాఖపట్నం ఆహార ప్రియుల కోసం బెంగాలీ వంటకాల ప్రత్యేక ఫుడ్ ఫెస్టివల్ ను అత్యంత వైభవంగా నిర్వహిస్తోంది. హోటల్ లోని ఆల్-డే డైనింగ్ రెస్టారెంట్ విస్టాలో ఈ నెల 23వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ప్రతిరోజూ రాత్రి 7:30 నుంచి 11 గంటల వరకు ఈ ఫెస్టివల్ జరగనుంది. బెంగాల్ సంప్రదాయ వంటకాల వైభవాన్ని, ఆ ప్రాంత ప్రత్యేక రుచులను, వంట సంస్కృతిని ప్రామాణికంగా ఆవిష్కరించడమే ఈ ఫుడ్ ఫెస్టివల్ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ ఫుడ్ ఫెస్టివల్ లో భాగంగా సుగంధ భరిత వంటకాలు, బెంగాల్లో ప్రసిద్ధి చెందిన చేపల వంటకాలు, సంప్రదాయ అనుబంధ వంటకాలు, అనేక ప్రాంతీయ ప్రత్యేకతలతో ఆకర్షణీయమైన విందును అందించ నున్నారు. బెంగాలీ ఆతిథ్య వెచ్చదనాన్ని, దాని ఆహార సంస్కృతి గొప్పతనాన్ని సొగసైన డైనింగ్ వాతావరణంలో అందించేలా ఈ ఫుడ్ ఫెస్టివల్ ను రూపొందించారు. సంప్రదాయ బెంగాలీ భోజనాల హాయి గొలిపే రుచుల నుంచి సీఫుడ్ ప్రత్యేకతల విలక్షణమైన రుచి వరకు అతిథులను బెంగాల్ వంటకాల ప్రయాణంలోకి తీసుకెళ్లనుంది. ఈ ఫెస్టివల్ బఫే విధానంలో అందుబాటులో ఉంటుంది. ఒక్కొక్కరికి రూ. 2,200 ప్లస్ పన్నులు మరియు స్థానిక పన్నులు అదనం. భారతదేశ విభిన్న ప్రాంతీయ వంటకాలను క్యూరేటెడ్ ఫుడ్ ఫెస్టివల్స్ ద్వారా పరిచయం చేస్తూ విలక్షణమైన డైనింగ్ అనుభవాలను

అందించడంలో భాగంగా ఈ ఫుడ్ ఫెస్టివల్ ను నిర్వహిస్తున్నట్లు ది పార్క్ విశాఖపట్నం యాజమాన్యం తెలిపింది.

పంచాయతీ ఎన్నికల వేళ పెందుర్తిలో పోలీసుల రూట్ మార్చ్

సిటిజన్ టైమ్స్, విశాఖపట్నం, అక్టోబర్ 22:
రాబోయే పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా నిర్వహించేందుకు పెందుర్తి పోలీసులు రూట్ మార్చ్ నిర్వహించారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.వి. సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ఇప్పిలివానిపాలెం, నందవరపు పాలెం, చింతగట్ల, పెదగాడి గ్రామాల్లో పోలీసు సిబ్బంది కవాతు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పోలీసులు సూచించారు. ఎన్నికల సమయంలో బెదిరింపులు, గొడవలు,

ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో అనుమానాస్పద కార్యకలాపాలు, ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సామాజిక మాధ్యమాల్లో ధ్రువీకరించని వార్తలు, వదంతులను ప్రచారం చేయవద్దని ప్రజలకు సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని ఇన్‌స్పెక్టర్ విజ్ఞప్తి చేశారు.

రైల్వే స్టేషన్లలో జన సంవాద్.. ప్రజల నుంచి 17,500 సూచనలు

సిటిజన్ టైమ్స్, విశాఖపట్నం, అక్టోబర్ 22
ప్రయాణికుల సమస్యలు తెలుసుకుని రైల్వే సేవలను మెరుగుపరిచే లక్ష్యంతో దక్షిణ కోస్తా రైల్వే పరిధిలోని 350కి పైగా స్టేషన్లలో 'జన సంవాద్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 220 మందికి పైగా అధికారులు, 800 మందికి పైగా సిబ్బంది పాల్గొని 17,500 మందికి పైగా ప్రయాణికుల నుంచి అభిప్రాయాలు, సూచనలు, ఫిర్యాదులను స్వీకరించారు. దక్షిణ కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొని, ప్రయాణికులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రైల్వే భద్రత, పరిశుభ్రత, ప్రయాణికుల సౌకర్యాలపై అవగాహన కల్పిస్తూ మెరుగైన సేవలకు ప్రజల భాగస్వామ్యం అవసరమని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

జీవీఎంసీ ఎన్నికల ఏర్పాట్లు వేగవంతం చేయాలి: కలెక్టర్

సిటిజన్ టైమ్స్, విశాఖపట్నం, అక్టోబర్ 22
జీవీఎంసీ రెండో సాధారణ ఎన్నికలు--2026కు సంబంధించి ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. గురువారం నార్త్ జోన్, గాజువాక జోన్లలోని పంపిణీ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి ఏర్పాట్ల పురోగతిని సమీక్షించారు. ఓటర్లు, ఎన్నికల సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని, ఓటర్ల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా బారికేడ్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎన్నికల అధికారులు, పోలీసు సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా జరిగేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

16వ వార్డులో వైసీపీ నేతల ఇంటింటి ప్రచారం

మేయర్ అభ్యర్థి వరద కళ్యాణి, కార్పొరేటర్ అభ్యర్థి సత్యాల సాగరికకు ప్రజల సమస్యలపై వినతులు

సిటిజన్ టైమ్స్, విశాఖపట్నం, అక్టోబర్ 22:
జీవీఎంసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థి వరద కళ్యాణి, 16వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి సత్యాల సాగరిక విశాఖ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మూలి అప్పారావుతో కలిసి గురువారం వార్డులోని పలు ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కనకమాలక్ష్మి నగర్-1, కనకమాలక్ష్మి నగర్-2, పాండురంగాపురం, విష్ణుపురి కాలనీల్లో పర్యటించి స్థానిక ప్రజలను కలుసుకున్నారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. గత ప్రభుత్వంతో పోలిస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో నిత్యావసర సరుకుల ధరల్లో వచ్చిన మార్పులపై ప్రజలతో మాట్లాడారు. ప్రచార సమయంలో స్థానికులు తమ ప్రాంతాల్లో బెల్ట్ షాపులు అధికంగా ఉన్నాయని అభ్యర్థుల దృష్టికి తీసుకువచ్చినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని అభ్యర్థులు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వార్డులోని సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని సత్యాల సాగరిక హామీ ఇచ్చారు. విశాఖపట్నం నగర అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని వరద కళ్యాణి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మేయర్, కార్పొరేటర్ అభ్యర్థులకు మద్దతుగా ఓటు వేయాలని వైసీపీ నాయకులు ప్రజలను కోరారు. వార్డులోని సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులపై అభ్యర్థులు ఇచ్చిన హామీలను ప్రజలకు వివరించారు. ప్రచారానికి స్థానికుల నుంచి స్పందన లభించిందని పార్టీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులతో పాటు వార్డు నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

36, 37వ వార్డుల్లో కూటమి అభ్యర్థుల తరపున ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రచారం

సిటిజన్ టైమ్స్, విశాఖపట్నం, అక్టోబర్ 22:
జీవీఎంసీ ఎన్నికల నేపథ్యంలో విశాఖ దక్షిణ నియోజకవర్గంలోని 36, 37వ వార్డుల్లో ఎమ్మెల్యే, జనసేన నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి మేయర్ అభ్యర్థి ముక్కా శ్రావణితో పాటు కార్పొరేటర్ అభ్యర్థులు మోనికా నిర్మల్ దాసరి, శివప్రసాద్ రెడ్డికి మద్దతుగా ఓటర్లను కలుసుకున్నారు. 36వ వార్డులో ర్యాలీ నిర్వహించగా, 37వ వార్డులో గడపగడపకు వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు. అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. దక్షిణ నియోజకవర్గంలోని 16 స్థానాల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రచారంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

7వ వార్డులో కూటమి అభ్యర్థి విజయానికి ఐక్యంగా పనిచేయాలి: గంటా రవితేజ

మొల్లి లక్ష్మణరావు సేవలకు సముచిత గుర్తింపు కల్పిస్తాం

సిటిజన్ టైమ్స్, విశాఖపట్నం, అక్టోబర్ 22:
జీవీఎంసీ 7వ వార్డులో కూటమి అభ్యర్థి అర్జల మహేశ్వరి విజయానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని టీడీపీ యువ నాయకుడు గంటా రవితేజ పిలుపునిచ్చారు. బుధవారం నిర్వహించిన కూటమి ఐక్యత సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పొత్తు ధర్మాన్ని గౌరవిస్తూ అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. 7వ వార్డును పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించినంత మాత్రాన సీనియర్ నాయకుడు మొల్లి లక్ష్మణరావును విస్మరించినట్లు కాదని స్పష్టం చేశారు. కొండవాలు ప్రాంతంలో సుమారు 2,750 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందించడంలో మొల్లి లక్ష్మణరావు చేసిన కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ప్రజలకు సేవలందించిన నాయకుల కృషిని ఎప్పటికీ మరచిపోమని, మొల్లి లక్ష్మణరావుకు భవిష్యత్తులో మరింత సముచిత గౌరవం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. కూటమి అభ్యర్థి అర్జల మహేశ్వరిని అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జనసేన భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్, మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు, నమ్మి శ్రీను, జనసేన 7వ వార్డు అధ్యక్షుడు దేవర శివ, బీజేపీ వార్డు అధ్యక్షుడు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జడ్పీటీసీ అభ్యర్థిగా జనసేన నుంచి కురిమిన మానస

సిటిజన్ టైమ్స్, పద్మనాభం
విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండల జడ్పీటీసీ అభ్యర్థిగా జనసేన పార్టీ తరపున కురిమిన మానస పేరు ఖరారైంది. 24 ఏళ్ల మానస, భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ రామస్వామినాయుడు కుమార్తె. ఆమె పద్మనాభం మండలం అయినాడ గ్రామానికి చెందినవారు. స్థానికంగా జనసేన పార్టీ తరపున జడ్పీటీసీ అభ్యర్థిగా మానస పోటీ చేయనుండటంతో ఎన్నికలపై ఆసక్తి నెలకొంది. యువ అభ్యర్థిగా ఆమె ఎన్నికల బరిలోకి దిగుతున్నారు.

రాబిన్‌హుడ్ పండుగ. సాయన్నకు ఘన నివాళి

సిటిజన్ టైమ్స్, హుస్నాబాద్, అక్టోబర్ 22:
పండుగ.సాయన్న ముదిరాజ్ 174వ జయంతి సందర్భంగా హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదలు, అణగారిన వర్గాల కోసం పోరాడిన పండుగ సాయన్న చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని కోరారు. ముదిరాజ్ కులాన్ని బీసీ-డీ నుంచి బీసీ-ఏ కేటగిరీలోకి మార్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ ప్రజాప్రతినిధులు, బీసీ, ముదిరాజ్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ధర్మపురి బస్‌స్టేషన్ ఆధునికీకరణ పనుల ఏర్పాట్ల పరిశీలన

సిటిజన్ టైమ్స్, ధర్మపురి, అక్టోబర్ 22
ధర్మపురి పట్టణంలోని బస్‌స్టేషన్ ఆధునికీకరణ పనులకు ఈ నెల 25న శంకుస్థాపన జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఏర్పాట్లను పరిశీలించారు. రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ కార్యక్రమానికి హాజరుకానున్న నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఏర్పాట్లపై సమీక్షించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

సవరపాలెం - రెడ్డిపల్లి ఎంపీటీసీ నామినేషన్ దాఖలు

అమలాపురం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 22
రూరల్ మండలం సవరపాలెం - రెడ్డిపల్లి ఎంపీటీసీ వైఎస్సార్ అభ్యర్థి కోనాల రమేష్ బాబు నామినేషన్ దాఖలు చేశారు .అభ్యర్థి తరపున వైఎస్సార్ సీనియర్ నాయకులు సత్తి వెంకటేశ్వరరావు (గాంధీ), సత్తి చిన్న కేతా శ్రీను నామినేషన్ వేయించడం జరిగింది.

టీడీపీ పదవులకు గరికిన ఎల్లయ్య (కింగ్) రాజీనామా

సిటిజన్ టైమ్స్, భీమిలి, అక్టోబర్ 22:
జీవీఎంసీ ఐదో వార్డు మంగమారిపేటకు చెందిన గరికిన ఎల్లయ్య (కింగ్) గురువారం టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్ష పదవికి, ఐదో వార్డు పార్టీ ఇన్‌ఛార్జి పదవికి, శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానం బోర్డు సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు పోస్టు ద్వారా రాజీనామా లేఖ పంపినట్లు తెలిపారు. గత 40 ఏళ్లుగా టీడీపీలో కొనసాగుతూ పార్టీకి, ప్రజలకు సేవలందించానని, 18 ఏళ్లపాటు నగరపాలెం పంచాయతీ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై ప్రజలకు సేవ చేశానని పేర్కొన్నారు. మంగమారిపేటకు చెందిన జనసేన పార్టీ నాయకులు కొందరు తనపై తప్పుడు ప్రచారం చేశారని ఆవేదన వ్యక్తం చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇకపై టీడీపీ కార్యకర్తగా కొనసాగుతానని స్పష్టం చేశారు.

నెల్లిమర్ల స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్ట భద్రత: జిల్లా ఎస్పీ

సిటిజన్ టైమ్స్, విజయనగరం, అక్టోబర్ 22:
నెల్లిమర్ల నగర పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో బ్యాలెట్ బాక్సులను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్, జిల్లా కలెక్టర్ ఎస్. రామసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం సీకేఎంజీకే కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను వారు పరిశీలించి భద్రతా చర్యలను సమీక్షించారు. బ్యాలెట్ బాక్సులకు వర్షపు నీటి వల్ల ఎలాంటి నష్టం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద రెండు గార్డులను ఏర్పాటు చేయాలని, ఒకరిని గది వద్ద, మరొకరిని పైకప్పు ప్రాంతంలో విధుల్లో ఉంచాలని ఆదేశించారు. అనధికార వ్యక్తులు లోపలికి ప్రవేశించకుండా సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. అనంతరం ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించి, అభ్యర్థితో పాటు మరో ఇద్దరికి మాత్రమే కేంద్రంలోకి అనుమతి ఇవ్వాలని పోలీసు అధికారులకు సూచించారు. ఎన్నికలకు ముందు, పోలింగ్ సమయంలో, అనంతరం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నామినేషన్ కేంద్రాల వద్ద ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పర్యటనలో రెవెన్యూ, పోలీసు, నగర పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

పాడి రైతులకు తక్కువ ధరకు పశుదాణా

నెలకు 300 టన్నుల సరఫరాకు కలెక్టర్ కసరత్తు

నాణ్యతలో రాజీ వద్దు..

స్థానిక తయారీ యూనిట్ల ఏర్పాటుపై దృష్టి

అమలాపురం, సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 22
పాడి రైతులకు సరసమైన ధరలకు నాణ్యమైన పశుదాణా అందించడమే లక్ష్యంగా సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ లిడా. ఆర్. మహేష్ కుమార్ గారులి వెల్లడించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో పశుసంవర్ధక శాఖ అధికారులు, పశుదాణా తయారీ సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పశుదాణాకు ఉన్న డిమాండ్, ప్రస్తుత మార్కెట్ ధరలు, తయారీ వ్యయాలు, ముడి సరుకుల లభ్యత తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలోని పాడి రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నెలకు సుమారు 300 మెట్రిక్ టన్నుల పశుదాణా సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డా. ఎల్. అనిత, డీడీ, అమలాపురం; డా. ఓ. రామకృష్ణ, ఏడీ, ఆర్‌సీపీఎం; డా. బీవీవీ సత్యనారాయణ, ఏడీ, ఆలమూరు; ఎ. వర ప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, కోఆపరేటివ్ డిపార్ట్‌మెంట్; పి. బాబు ప్రసాద్, ఆర్.ఐ.; డా. బి.ఆర్.వి.ఎస్. రావు, ఏడీసీ (ఏహెచ్), మచిలీపట్నం; డా. ఎన్. రవీంద్ర కుమార్, వీఏఎస్/వీడీవో, మలికిపురం; డా.జి.రాజా శ్రీనివాస్, వీఏఎస్/వీడీవో, పుల్లలచెరువు; మట్టా మాతలక్ష్మి ప్రభాకరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు, రోళ్లపాలెం తదితరులు పాల్గొన్నారు.

వలందపేటలో బాణసంచా పేలుడు..

తీవ్రంగా గాయపడిన చిన్నారులకు గంటా రవితేజ పరామర్శ

బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని గంటా రవితేజ భరోసా

భీమిలి సిటిజెన్ టైమ్స్ అక్టోబర్ 22

దసరా ఉత్సవాల సందర్భంగా బుధవారం రాత్రి 10.30 గంటల సమయంలో జీవీఎంసీ 2వ వార్డులో వలందపేట బాణసంచా పేలుడు ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో నలుగురు చిన్నారులు తీవ్రంగా గాయపడటంతో వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ యువ నాయకుడు గంటా రవితేజ గురువారం ఆసుపత్రులను సందర్శించి, చికిత్స పొందుతున్న చిన్నారులను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ ప్రమాదంలో చిల్లా గౌతమ్ (8), చిల్లా సుశాంత్ (5), బాకి కార్తికేయ (5), సరగడ సన్ముఖ్ సాయి (10) గాయపడ్డారు. వీరికి అపోలో ఆసుపత్రి (అరిలోవ), ఎన్ఆర్ఐ ఆసుపత్రి (సంగివలస), అపూర్వ ఆసుపత్రి (సీతమ్మధార), ఆయుష్మాన్ ఆసుపత్రి (కేజీహెచ్ ఎదురుగా)ల్లో చికిత్స అందిస్తున్నారు. ఆసుపత్రులకు వెళ్లిన గంటా రవితేజ చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, ఈ కష్ట సమయంలో అండగా ఉంటామని, అవసరమైన సహాయం అందించేందుకు తన వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం సంబంధిత వైద్యులతో మాట్లాడి, చిన్నారులకు అవసరమైన వైద్య సేవలు అందించాలని కోరారు. వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, మెరుగైన చికిత్స అందేలా చూడాలని వైద్యులకు విజ్ఞప్తి చేశారు. పండుగ వేళ చిన్నారులు ప్రమాదానికి గురికావడం బాధాకరమని పేర్కొంటూ, బాణసంచా వినియోగంలో తల్లిదండ్రులు, ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని, చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని గంటా రవితేజ సూచించారు. గాయపడిన చిన్నారులు త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఇళ్లకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

జిన్నారం మండలం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 22

జిన్నారం మండల పరిధిలోని గడ్డపోతారం మున్సిపల్ వావిలాల గ్రామ శివారులో గుర్తుతెలియని మహిళ మృతి దేహం లభ్యమైనది మృతురాలి వయసు 40 ఉంటుందని ఇతర ప్రాంతాల్లో హత్య చేసి మృతదేహాన్ని తీసుకొచ్చి ఇక్కడ పడేసి ఉంటారని భావిస్తున్నారు మృతురాలి మెడపై కత్తితో దాడి చేసినట్లు ఆనవాళ్లు ఉన్నాయి మృత దేహం ఎవరైనా గుర్తు పడితే జిన్నారం పోలీసులకు తెలపాలని వారు కోరారు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు

రెండో రోజు కాకినాడ జిల్లాలో 20 జెడ్పీటీసీ స్థానాలకు 51 నామినేషన్ల దాఖలు

నామినేషన్ పత్రాలు స్వీకరించిన రిటర్నింగ్ అధికారి జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్

కాకినాడ, సిటిజన్ టైమ్స్ అక్టోబరు 22:

కాకినాడ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా జిల్లా ప్రాదేశిక నియోజకవర్గం (జెడ్పీటీసీ), మండల ప్రాదేశిక (ఎంపీటీసీ) స్థానాలకు గురువారం రెండో రోజు నామినేషన్ల పర్వం సజావుగా సాగింది. రెండో రోజు గురువారం ఉదయం 10:30 నిమిషాల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆర్వో, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ గారు వివిధ పార్టీలకు సంబంధించిన అభ్యర్థుల నుంచి మొత్తం 51 నామినేషన్ల పత్రాలను స్వీకరించారు. జిల్లాలోని 20 మండల కేంద్రాల్లో వివిధ పార్టీలకు సంబంధించిన మొత్తం 262 మంది అభ్యర్థులు ఎంపీటీసీలుగా నామినేషన్లు దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రియా, ఏఆర్వో జెడ్పీ సీఈఓ లక్ష్మణరావు, డిప్యూటీ సీఈఓ డి. శ్రీలలిత, ఇతర జెడ్పీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు ఆదేశాలపై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోంది: అచ్చెన్నాయుడు

సిటిజన్ టైమ్స్, అమరావతి, అక్టోబర్ 22:

సుప్రీంకోర్టు ఆదేశాలను వైసీపీ నేతలు వక్రీకరిస్తూ ప్రభుత్వానికి చెంపదెబ్బ పడిందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. వైసీపీ నేత ధర్మాన ప్రసాదరావు సుప్రీంకోర్టు ఆదేశాలను పూర్తిగా చదివి అర్థం చేసుకోవాలని వ్యాఖ్యానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నారనే ఫిర్యాదులు అందితే, సంబంధిత ఆధారాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు సూచించిందని మంత్రి తెలిపారు. శాంతిభద్రతల సమస్యల కారణంగా నామినేషన్లు దాఖలు చేయలేకపోయినట్లు నిర్ధారణ అయితే సంబంధిత పట్టణ స్థానిక సంస్థల్లో మాత్రమే గడువు పొడిగించాలని, అది కూడా నిర్ణయం తీసుకున్నప్పటి నుంచి 48 గంటలకు మించరాదని కోర్టు స్పష్టం చేసిందన్నారు. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు దౌర్జన్యాలు జరిగాయని, ప్రతిపక్ష అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేశారని అచ్చెన్నాయుడు ఆరోపించారు. అప్పటి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ వైసీపీ గత పాలనపై విమర్శలు చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా పనిచేస్తోందని, ఎన్నికల నిర్వహణలో ఫిర్యాదులను పరిశీలించి తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించబోమని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ఇవన్నీ వైసీపీపై మంత్రి చేసిన ఆరోపణలుగా పేర్కొనాలి.

ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిరంతర నిఘా: ఎస్పీ మహేశ్వరరెడ్డి

సిటిజన్ టైమ్స్, శ్రీకాకుళం, అక్టోబర్ 22:

శ్రీకాకుళం జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం రణస్థలం, జి.సిగడం, లావేరు, పొందూరు, నరసన్నపేట, నందిగాం, పలాస, వజ్రపుకొత్తూరు తదితర మండలాల్లోని నామినేషన్ కేంద్రాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. నామినేషన్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు, బారికేడ్లు, ట్రాఫిక్ నియంత్రణ, అభ్యర్థుల వాహనాల రాకపోకలను సమీక్షించారు. కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో నిబంధనల ప్రకారం భద్రత అమలు చేయాలని, అనుమతి లేని వాహనాలు, పార్కింగ్‌ను నియంత్రించాలని అధికారులను ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని, ప్రజలు గుంపులుగా చేరకుండా, అనుమతి లేని ర్యాలీలు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల నియమావళి, అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పోలీసు సిబ్బంది ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా సాగేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

అధికార పార్టీని ఆశీర్వదించండి

మున్సిపల్ చైర్మన్ కూటమి అభ్యర్థి నల్లా శ్రీధర్ విస్తృత ప్రచారం

అమలాపురం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 22

మున్సిపల్ ఎన్నికల సందర్భంగా అమలాపురం పట్టణంలో 30, 31 వార్డులలో అమలాపురం మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి నల్లా శ్రీధర్ ఇంటింటికి తిరిగి తమ ప్రచారాన్ని కొనసాగించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమలాపురం మున్సిపాలిటీ అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తానని, మున్సిపాలిటీలో ఉన్న సమస్యలను కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరిస్తానని, అధికార పార్టీని ఆదరించాలని కోరారు. అనంతరం పట్టణంలోని డాక్టర్లను కలిసి కూటమి చైర్మన్ అభ్యర్థి నల్లా శ్రీధర్ అమలాపురం డాక్టర్లు అందరూ తమను ఆశీర్వదించాలని కోరారు.

కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికపై వివాదం..

జిల్లా నాయకత్వంపై అసంతృప్తి

షర్మిల ఆదేశాలను పట్టించుకోలేదంటూ డీసీసీపై ప్రియాంక దండి వర్గం ఆరోపణలు

సిటిజన్ టైమ్స్, విశాఖపట్నం, అక్టోబర్ 22:

జీవీఎంసీ రెండో సాధారణ ఎన్నికల నేపథ్యంలో విశాఖపట్నం కాంగ్రెస్ పార్టీలో మేయర్ అభ్యర్థి ఎంపిక వ్యవహారం వివాదానికి దారితీసింది. పార్టీ అభ్యర్థిగా ప్రియాంక దండిని అధిష్ఠానం ఖరారు చేసిందని ఆమె వర్గం పేర్కొంటుండగా, చివరి నిమిషంలో జిల్లా నాయకత్వం దేవర నాగ సునంద దేవికి బి-ఫారం అందించిందని ఆరోపిస్తోంది. ఈ పరిణామం పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రియాంక దండిని అభ్యర్థిగా అంగీకరించాలని కోరుతూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి వినతిపత్రం పంపించినప్పటికీ, సమయం ముగియడంతో ప్రయోజనం లేకుండా పోయిందని ప్రియాంక వర్గం తెలిపింది. జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నాయకత్వం పీసీసీ ఆదేశాలను పట్టించుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. పార్టీ కోసం చాలాకాలంగా చురుకుగా పనిచేస్తున్న ప్రియాంక దండిని కాదని, చివరి నిమిషంలో మరో అభ్యర్థికి అవకాశం కల్పించడంపై కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. అభ్యర్థుల ఎంపికలో జిల్లా నాయకత్వం వ్యవహరించిన తీరుపై పార్టీ అంతర్గతంగా చర్చ జరుగుతోందని ప్రియాంక వర్గీయులు పేర్కొంటున్నారు. డీసీసీ నాయకత్వానికి, ప్రియాంక దండికి మధ్య కొంతకాలంగా విభేదాలు కొనసాగుతున్నాయని ఆమె వర్గం ఆరోపిస్తోంది. ప్రజల్లో గుర్తింపు పొందుతున్న యువ నాయకురాలికి పార్టీ అవకాశాలు కల్పించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై జిల్లా నాయకత్వం వివరణ అందుబాటులో లేదు. జీవీఎంసీ సమావేశ మందిరంలో ఇరు వర్గాల మధ్య జరిగిన వాగ్వాదం సందర్భంగా పీసీసీ అధ్యక్షురాలు షర్మిలపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ప్రియాంక వర్గం ఆరోపించినట్లు సమాచారం. ఈ అంశంపై పార్టీ అధిష్ఠానం స్పందించి, ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ప్రియాంక దండికి పీసీసీ అధ్యక్షురాలి మద్దతు ఉందని, తనకు న్యాయం జరుగుతుందని

ఆమె వర్గీయులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అభ్యర్థి ఎంపిక వివాదంపై పార్టీ అధిష్ఠానం ఎలా స్పందిస్తుంది, జిల్లా నాయకత్వంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది అనేది ఆసక్తికరంగా మారింది.

పల్నాడు జిల్లాలో 831 నామినేషన్లు

సిటిజన్ టైమ్స్, నరసరావుపేట, అక్టోబర్ 22:

పల్నాడు జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రశాంతంగా సాగుతోందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కృతిక శుక్ల తెలిపారు. అక్టోబర్ 21, 22 తేదీల్లో కలిపి 28 జడ్పీటీసీ స్థానాలకు 63, 419 ఎంపీటీసీ స్థానాలకు 768 నామినేషన్లు దాఖలైనట్లు వెల్లడించారు. గురువారం నరసరావుపేట రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో జరుగుతున్న జడ్పీటీసీ నామినేషన్ ప్రక్రియను అదనపు ఎస్పీ రోహిత్ చౌదరి, జడ్పీటీసీ ఎన్నికల అధికారి సంజన శ్రీహర్షతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గురువారం ఒక్కరోజే జడ్పీటీసీ ఎన్నికలకు టీడీపీ నుంచి 38, వైసీపీ నుంచి 10, సీపీఐ(ఎం) నుంచి 4, స్వతంత్ర అభ్యర్థుల నుంచి 2 నామినేషన్లు కలిపి మొత్తం 54 దాఖలైనట్లు తెలిపారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వేములలో వైసీపీ అభ్యర్థులకు నామినేషన్ అడ్డంకులు!

కృపానగర్ వద్ద పోలీసుల అడ్డగింత.. రోడ్డుపై బైఠాయించి వైసీపీ నాయకుల నిరసన

సిటిజన్ టైమ్స్, పులివెందుల, అక్టోబర్ 22:
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను నామినేషన్లు దాఖలు చేసేందుకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారనే ఆరోపణలు వేముల మండలంలో కలకలం రేపాయి. బుధవారం వేముల మండలానికి చెందిన వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు వెళ్తుండగా, వేముల కృపానగర్ క్రాస్ సమీపంలోని జగనన్న కాలనీ వద్ద పోలీసులు వారిని అడ్డుకున్నట్లు వైసీపీ నాయకులు ఆరోపించారు. అభ్యర్థులు శాంతియుతంగా నామినేషన్లు దాఖలు చేసేందుకు వెళ్తున్నప్పటికీ పోలీసులు అడ్డుకోవడం ఏమిటని వైసీపీ నాయకులు ప్రశ్నించారు. అభ్యర్థులకు మద్దతుగా వస్తున్న నాయకులను సైతం ముందుకు వెళ్లనీయకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. పోలీసుల చర్యలకు నిరసనగా వైసీపీ నాయకులు, అభ్యర్థులు, కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ, ఎన్నికల్లో తమ పార్టీ విజయాన్ని తట్టుకోలేక కూటమి ప్రభుత్వం, టీడీపీ నాయకులు పోలీసు వ్యవస్థను ఉపయోగించుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అభ్యర్థులకు నామినేషన్లు దాఖలు చేసే అవకాశం కల్పించకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమని విమర్శించారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి అభ్యర్థికి సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని వారు పేర్కొన్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ప్రతిపక్ష అభ్యర్థులను అడ్డుకోవడం సరికాదని అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాల్సిన అధికారులు, పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. వేముల మండలంలో చోటుచేసుకున్న ఈ పరిణామాలపై సంబంధిత ఎన్నికల అధికారులు స్పందించి, నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని వైసీపీ నాయకులు కోరారు. ఈ ఘటనపై పోలీసుల వివరణ తెలియాల్సి ఉంది.

నవంబర్ 1 నుంచి పుర పోరు.. 99 మున్సిపాలిటీల్లో ఎన్నికలు

నవంబర్ 3న కౌంటింగ్..

25న అభ్యర్థుల తుది జాబితా

సిటిజన్ టైమ్స్, అమరావతి, అక్టోబర్ 22:
ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు జరగాల్సిన ఎన్నికలకు రంగం సిద్ధమైంది. రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) నవంబర్ 1వ తేదీ నుంచి ఎన్నికల ప్రక్రియను ప్రారంభించేందుకు షెడ్యూల్ విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 99 పట్టణ, నగరపాలక సంస్థల ఎన్నికలను రీషెడ్యూల్ చేస్తూ ఈ నిర్ణయం తీసుకుంది. సవరించిన షెడ్యూల్ ప్రకారం నవంబర్ 1న పోలింగ్ నిర్వహించనుండగా, నవంబర్ 3న ఎన్నికల ఫలితాలు వెల్లడించనున్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో అభ్యర్థుల తుది జాబితాను నవంబర్ 25న ప్రకటించనున్నట్లు సమాచారం. మరోవైపు, మైదుకూరులో మున్సిపాలిటీకి సంబంధించి పోలింగ్ తేదీని ఎన్నికల సంఘం ప్రకటించలేదు. మైదుకూరులో నిబంధనల ప్రకారం మళ్లీ నామినేషన్ల ప్రక్రియ పూర్తయిన తర్వాతే పోలింగ్ తేదీని ఖరారు చేయనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.

మున్సిపల్ చైర్మన్ కాంగ్రెస్ అభ్యర్థి ప్రచార జోరు

అమలాపురం, సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 22
అమలాపురం మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ జెండా రెపరెపలాడింది. చైర్మన్ పదవికి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ముషిణి నాగేంద్ర మణి గురువారం అమలాపురం పట్టణంలో ప్రచారం చేపట్టారు. పట్టణ మెయిన్ రోడ్ లో కాంగ్రెస్ పార్టీ విస్తృత ప్రచారం జరిగింది. ఈ ప్రచారంలో సీడబ్ల్యూసీ సభ్యులు గిడుగు రుద్రరాజు, పీసీసీ సభ్యులు ముషిణి రామకృష్ణారావు, డీసీసీ అధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాసరావు, అమలాపురం పట్టణ అధ్యక్షుడు వంటేద్దు బాబీ, డాక్టర్ దేవరపల్లి రాజేంద్ర బాబు, వాకపల్లి రాంబాబు, బి.జె.ఆర్. బాబు, కుడుపూడి శ్రీనివాసరావు, గూడాల పుల్లంశెట్టి, ఏలేశ్వరపు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజేశ్వరికి టీడీపీలో కీలక పదవి దక్కేనా?

గాజువాకలో రాజేశ్వరితో ప్రణవ్ గోపాల్ భేటీ.. రాజకీయ వర్గాల్లో చర్చ

అభిమానుల ప్రశ్న.. హామీ ఇచ్చిన పదవి ఏమిటి?

సిటిజన్ టైమ్స్, విశాఖపట్నం, అక్టోబర్ 22:
గాజువాకకు చెందిన పులిచెర్ల రాజేశ్వరికి తెలుగుదేశం పార్టీలో కీలక పదవి దక్కనుందా? ఆమెకు పార్టీ నాయకత్వం ఎలాంటి బాధ్యతలు అప్పగించనుంది? ప్రస్తుతం ఈ అంశాలు స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. గురువారం వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ గాజువాకలోని రాజేశ్వరి నివాసానికి వెళ్లి ఆమెతో భేటీ కావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. టీడీపీలో ఉన్నత పదవి కల్పిస్తామంటూ పార్టీ నాయకులు రాజేశ్వరిని సంప్రదించినట్లు సమాచారం. పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్‌తో మాట్లాడి ఆమెకు సముచిత పదవి కల్పించేలా చూస్తామని ప్రణవ్ గోపాల్ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఆమెకు ఏ పదవి ఇవ్వాలనే విషయంపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు.

అభిమానుల్లో ఆసక్తి.. నాయకత్వంపై ప్రశ్నలు
రాజేశ్వరికి పదవి కల్పిస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో, ఆమె అభిమానులు టీడీపీ నాయకులను ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. పార్టీలో ఆమెకు ఎలాంటి బాధ్యతలు అప్పగించనున్నారో స్పష్టంగా వెల్లడించాలని కోరుతున్నారు. హామీలకే పరిమితం కాకుండా, పదవిపై స్పష్టత ఇవ్వాలని వారు అభిప్రాయపడుతున్నారు.

రాజేశ్వరికి బి.వి. రామ్ మద్దతు
ఇటీవల తెలుగు శక్తి అధినేత బి.వి. రామ్ కూడా రాజేశ్వరి నివాసానికి వెళ్లి ఆమెకు మద్దతు ప్రకటించారు. ఈ పరిణామం అనంతరం టీడీపీ నాయకులు రాజేశ్వరితో సంప్రదింపులు జరపడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ వరుస పరిణామాలు ఆమె రాజకీయ భవిష్యత్తుపై ఆసక్తిని పెంచాయి. ఈ సందర్భంగా బి.వి. రామ్

మాట్లాడుతూ, మేయర్ పదవికి మంచి అభ్యర్థి తప్పుకోవాల్సి రావడం బాధాకరమని వ్యాఖ్యానించారు. రాజేశ్వరి ఆహ్వానం మేరకే ఆమెను కలవడానికి వచ్చినట్లు తెలిపారు. రాజకీయ పరిణామాలు ఎలా ఉన్నా అవినీతి, అక్రమాలపై తన పోరాటాన్ని కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

అధికారిక ప్రకటన కోసం ఎదురుచూపులు
రాజేశ్వరికి టీడీపీ నాయకత్వం ఎలాంటి పదవి కేటాయించనుంది? ఆమెకు ఇచ్చిన హామీలు కార్యరూపం దాలుస్తాయా? అన్న అంశాలపై స్థానికంగా చర్చ కొనసాగుతోంది. అయితే పదవి కేటాయింపుపై పార్టీ అధిష్ఠానం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. అప్పటివరకు ఈ అంశంపై నెలకొన్న ఉత్కంఠ కొనసాగనుంది.

ఆపదలో ఉన్న స్నేహితుడికి ఆపన్న హస్తం అందించిన బాల్యమిత్రులు

సిటిజన్ టైమ్స్, హుస్నాబాద్,అక్టోబర్22:
కష్టకాలంలో ఉన్న స్నేహితుడికి మేమున్నామంటూ 80000 రూపాయలు ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు బాల్యమిత్రులు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ జెడ్ పి హెచ్ ఎస్ 1990–91 పదవ తరగతి బ్యాచ్ మిత్రులు తమ తోటి మిత్రుడు ఈగ శ్రీనివాస్ కుమార్తె కంటి దృష్టి సమస్యతో బాధపడుతూ శస్త్ర చికిత్స చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలుసుకున్నారు. శ్రీనివాస్ కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండడంతో వైద్య ఖర్చులు మరింత ఇబ్బందికరంగా మారి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న శ్రీనివాస్ కుటుంబానికి అండగా నిలిచేందుకు తోటి మిత్రులు ముందుకు వచ్చారు. కష్టకాలంలో ఉన్న మిత్రుడు శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యాన్ని కల్పించారు. వైద్య ఖర్చులకోసం 80,000 తక్షణ ఆర్థిక సహాయాన్ని అందించారు. భవిష్యత్తులో కుటుంబానికి, కుమార్తె వైద్య ఖర్చుల విషయంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తన కష్టాన్ని తన కష్టంగా భావించి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికి శ్రీనివాస్ పేరు పేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ఇదిలా ఉండగా తేజస్విని శస్త్ర చికిత్సకు అవసరమైన వైద్య ఖర్చుల విషయంలో మరింత సహాయం అందాల్సిన అవసరం ఉండడంతో ఎవరైనా దాతలు స్పందించి సహాయం చేయాలని మిత్రమండలి సభ్యులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో భవానీ భక్తుల మృతి బాధాకరం

కత్తిపూడి ఘటనపై విచారం వ్యక్తం చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

కాకినాడ సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 22 :
కాకినాడ జిల్లా, కత్తిపూడి మండల పరిధిలోని రావికంపాడు జంక్షన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు భవానీ భక్తులు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ విచారం వ్యక్తం చేశారు. దీక్ష పూర్తి చేసుకుని కనకదుర్గమ్మ దర్శనానికి వస్తున్న భక్తులు మార్గమధ్యంలో ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని అన్నారు.మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. విషయం తెలిసిన వెంటనే ఘటనపై కాకినాడ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. రావికంపాడు జంక్షన్ సమీపంలో భక్తులు ప్రయాణిస్తున్న బస్సు నిలిచిపోవడంతో వారంతా కిందికి దిగి పక్కనే ఉన్న హోటల్‌కు వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన స్కార్పియో వాహనం ఢీకొట్టడంతో ప్రమాదం సంభవించినట్టు కలెక్టర్ వివరించారు. ఈ ప్రమాదంలో పలువురు గాయపడినట్టు తెలిపారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని పవన్ కళ్యాణ్ సూచించారు. మృతుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

కొండాపూర్‌లో ఘనంగా పండుగ సాయన్న జయంతి

సిటిజన్ టైమ్స్, ధర్మపురి, అక్టోబర్ 22:
జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం కొండాపూర్‌లో ముత్తిరాసి సంఘం ఆధ్వర్యంలో పండుగ సాయన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన యోధుడిగా పండుగ సాయన్న సేవలను కొనియాడారు. ఆయన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, కుల పెద్దలు, సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

బాధితుల వైద్య ఖర్చులు తానే భరిస్తానని హామీ

అమలాపురం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 22
అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని మాచవరం గ్రామం నుంచి నేదునూరులో జరిగిన వివాహ వేడుకకు వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో సుమారు 30 మంది గాయపడ్డారు. గాయపడిన వారు అమలాపురంలోని శ్రీనిధి ఆసుపత్రి, ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న పి. గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ ఆసుపత్రులకు వెళ్లి బాధితులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, పెళ్లి వేడుకకు వెళ్లి తిరిగి వస్తుండగా ఇలాంటి ప్రమాదం జరగడం చాలా దురదృష్టకరమని అన్నారు. ప్రమాదంలో గాయపడిన వారందరికీ మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించినట్లు తెలిపారు. బాధితుల వైద్యానికి అయ్యే ఖర్చులను తానే భరిస్తానని హామీ ఇచ్చారు. బాధితులకు అవసరమైన వైద్య సహాయం అందించేందుకు అన్ని విధాలా సహకరిస్తానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

తొండూరులో వైసీపీ ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులకు అడ్డంకులు

సిటిజన్ టైమ్స్, పులివెందుల, అక్టోబర్ 22:
వైసీపీ ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు వెళ్తుండగా తొండూరు గురుకుల పాఠశాల వద్ద పోలీసులు అడ్డుకున్నట్లు సమాచారం. దీంతో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు ముద్దనూరు--పులివెందుల హైవేపై బైఠాయించి నిరసనకు దిగారు.

19వ వార్డులో టీడీపీలోకి వైసీపీ నేతలు..

పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

గిద్దలూరు, సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 22

పట్టణంలోని 19వ వార్డులో తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు బిల్లా రమేష్ ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు గుండ్రెడ్డి కోటిరెడ్డి, ఓదెల పవన్, షేక్ వలి, ఓదెల శ్రీను, ఓదెల వెంకటేశ్వర్లు, ఓదెల మనోహర్, ఆంజనేయులు తదితరులు వైసీపీ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. కూటమి ప్రభుత్వ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గిద్దలూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాచర్లలో ముగిసిన దసరా వేడుకలు

ఘనంగా అమ్మవారి నిమజ్జన



గిద్దలూరు, సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 22

రాచర్ల మండల కేంద్రంలో అమ్మవారి నిమజ్జనంతో దసరా వేడుకలు ముగిశాయి. గత పది రోజులు గా విశేషపూజలందుకున్న అమ్మవారిని గురువారం నాడు గౌతవరం చెరువు లో నిమజ్జనం చేశారు అమ్మవారిని అలంకరించి అలంకరించిన వాహనము పై అధిష్టింప చేసి గ్రామోత్సవం వైభవ గా నిర్వహించారు . భక్తులు కాయాకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు మంగళ వాయిద్యాల నడుమ గ్రామోత్సవం అంగరంగ వైభవంగా సాగింది , అంతరం చెరువులో నిమజ్జనం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలనొసంగారు.

గిద్దలూరు మండలంలో రెండో రోజు నామినేషన్లు నిల్!

గిద్దలూరు, సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 22

మండల ప్రాదేశిక నియోజకవర్గాల (ఎంపీటీసీ) ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో రెండో రోజైన అక్టోబర్ 22, 2026న ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని ఎన్నికల అధికారులు తెలిపారు. ఈ విషయాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ. పాండు రంగారెడ్డి, సహాయ ఎన్నికల అధికారి జి.వి. మోహన్ కుమార్, మండల తహసీల్దార్ టి. ఫణీంద్రుడు వెల్లడించారు.

మాజీ మంత్రి హరీష్ రావుకు దసరా శుభాకాంక్షలు

-బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి

-మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్

గుమ్మడిదల మండలం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 22

దసరా పండుగను పురస్కరించుకుని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావును బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరీష్ రావుకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సన్మానించారు. విజయదశమి పర్వదినం ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు నింపాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దసరా పండుగ ప్రతి ఒక్కరికీ విజయాలను అందించాలని అన్నారు. ఈ సందర్భంగా హరీష్ రావుతో ఆత్మీయంగా మాట్లాడి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుమ్మడిదల మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు చక్రపాణి, కుమార్ గౌడ్, హుస్సేన్, వెంకట్ రామ్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ, శేఖర్ రెడ్డి, మహేష్, ఫయాజ్,బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కూటమి క్లీన్ స్వీప్ ఖాయం!

14 ఎంపీటీసీలు, జడ్పీటీసీ స్థానాల్లో గెలుపే లక్ష్యం

అభివృద్ధే మా అజెండా.. కూటమి నేతలు

సోమందేపల్లి, అక్టోబర్ 22 (సిటిజన్ టైమ్స్):

శ్రీ సత్యసాయి జిల్లా, పెనుకొండ నియోజకవర్గంలోని సోమందేపల్లి మండలంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీ, జనసేన కూటమి ఘన విజయం సాధిస్తుందని కూటమి నాయకులు ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని 14 ఎంపీటీసీ స్థానాలతో పాటు జడ్పీటీసీ స్థానాన్ని కూడా కైవసం చేసుకుంటామని, రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపు ఖాయమని స్పష్టం చేశారు. గురువారం నిర్వహించిన సమావేశంలో పలువురు కూటమి నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి: ఎంపీటీసీ అభ్యర్థి నీరుగంటి చంద్రశేఖర్

స్థానిక ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు సమన్వయంతో కలిసి పనిచేస్తామని ఎంపీటీసీ అభ్యర్థి నీరుగంటి చంద్రశేఖర్ తెలిపారు. ప్రజలు గత పాలనను, ప్రస్తుత ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించి ఓటు వేయాలని కోరారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆశించిన అభివృద్ధి జరగలేదని విమర్శించారు. కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతు తెలిపి విజయాన్ని అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రపంచం భారతదేశం వైపు చూసేలా చేసిన ఘనత మోడీ దే: ఎస్ఆర్ పార్థసారథిరెడ్డి

ప్రపంచ దేశాలు భారతదేశం వైపు చూసేలా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వం దేశ ప్రతిష్ఠను పెంచిందని బీజేపీ యువ నాయకుడు ఎస్ఆర్ పార్థసారథిరెడ్డి అన్నారు. అభివృద్ధి అంటే ఏమిటో కూటమి ప్రభుత్వం చేసి చూపిస్తోందని పేర్కొన్నారు. తమ జిల్లా నాయకుడు జీఎం శేఖర్ ఆదేశాల మేరకు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో కలిసి సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు. స్థానిక ఎన్నికలతో పాటు రానున్న అన్ని ఎన్నికల్లోనూ కూటమి విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతామని ధీమా వ్యక్తం చేశారు.

14 మంది ఎంపీటీసీలతో పాటు జడ్పీటీసీ స్థానం కైవసం చేసుకుంటాం

రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీతో విజయం సాధిస్తారని కూటమి నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం 14 మంది కూటమి ఎంపీటీసీ అభ్యర్థులు భారీ ఎత్తున నామినేషన్లు దాఖలు చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని 14 ఎంపీటీసీ స్థానాలతో పాటు జడ్పీటీసీ స్థానంలోనూ గెలిచి మంత్రి సవితమ్మకు విజయాన్ని కానుకగా అందిస్తామని పేర్కొన్నారు.

నాడు వైసీపీ అరాచకం.. నేడు కూటమి అభివృద్ధి: నడింపల్లి వెంకటేష్

గత వైసీపీ ప్రభుత్వ పాలనలో అరాచకాలు చోటుచేసుకున్నాయని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని కన్వీనర్ నడింపల్లి వెంకటేష్ అన్నారు.ప్రజలు గత పాలనను చూశారని, ఇప్పుడు అభివృద్ధి దిశగా సాగుతున్న కూటమి ప్రభుత్వ పనితీరును కూడా గమనిస్తున్నారని అన్నారు. ఈ ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి గెలుపు ఘన విజయం సాధించబోతున్నారని పేర్కొన్నారు.

నా భార్యకు జడ్పీటీసీ అవకాశం కల్పించిన మంత్రి సవితమ్మకు కృతజ్ఞతలు: సిద్దలింగప్ప

సోమందేపల్లి మండల జడ్పీటీసీ అభ్యర్థిగా తన భార్య జయంతికి అవకాశం కల్పించిన మంత్రి సవితమ్మకు మాజీ కన్వీనర్ సిద్దలింగప్ప కృతజ్ఞతలు తెలిపారు. తనపై, తన కుటుంబంపై నమ్మకంతో పార్టీ తరఫున అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో ఎన్నికల్లో విజయం సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

కూటమి విజయమే లక్ష్యంగా సమష్టి కార్యాచరణ

సోమందేపల్లి మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కూటమి నాయకులు ఐక్యంగా ముందుకు సాగుతున్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల మధ్య సమన్వయంతో అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని నిర్ణయించారు. అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును ప్రజల్లోకి తీసుకెళ్లి ఓటర్ల మద్దతు కూడగట్టాలని నాయకులు భావిస్తున్నారు. మండలంలోని 14 ఎంపీటీసీ స్థానాలు, జడ్పీటీసీ స్థానాన్ని గెలుచుకుని మంత్రి సవితమ్మకు విజయాన్ని కానుకగా అందించడమే తమ ప్రధాన లక్ష్యమని కూటమి నాయకులు స్పష్టం చేశారు.

అవినాష్ రెడ్డి పోలీసుల అదుపులోకి

సిటిజన్ టైమ్స్, పులివెందుల, అక్టోబర్ 22:

కడప వైసీపీ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని అక్టోబర్ 22న పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కడపలోని వైసీపీ జిల్లా కార్యాలయం వద్ద ఆయనను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. అనంతరం ఆయనను విడుదల చేసినట్లు సమాచారం.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి-రైతులకు మద్దతు ధర కల్పించాలి

సిటిజన్ టైమ్స్,అక్కన్నపేట, అక్టోబర్22

అక్కన్నపేట మండలంలోని అన్ని గ్రామాల్లో తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులకు మద్దతు ధర కల్పించాలని బీఆర్ఎస్ అక్కన్నపేట మండల అధ్యక్షుడు గుగులోతు రాజు నాయక్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్కన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో వరి కోతలు ప్రారంభమైనప్పటికీ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు రైతుల కల్లాల వద్దకే వచ్చి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా, 15 రోజుల్లో డబ్బులు చెల్లిస్తామని హామీ ఇస్తూ బస్తాకు రెండు నుంచి మూడు కిలోల వరకు తరుగు తీస్తున్నారని పేర్కొన్నారు. దీంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునే క్రమంలో రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. రైతులను దళారుల బారిన పడకుండా కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. అక్కన్నపేట మండలంలోని అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, రైతుల నుంచి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేసి, గిట్టుబాటు ధర అందేలా చర్యలు తీసుకోవాలని రాజు నాయక్ డిమాండ్ చేశారు.

తమన్నా బోల్డ్ ప్లానింగ్ దిమ్మతిరిగేలా!

దాదాపు 18 ఏళ్లుగా సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా.. విభిన్నమైన పాత్రలతో కెరీర్‌లో కొత్త ప్రయోగాలు చేస్తున్నారు. ఒకప్పుడు కమర్షియల్ సినిమాలు, గ్లామర్ పాత్రలు, డ్యాన్స్‌లతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ భామ.. ఇప్పుడు ఓటీటీ, హారర్, బోల్డ్ కంటెంట్ ఉన్న కథలతోనూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు.'లస్ట్ స్టోరీస్ 2', 'జీ కర్దా' వంటి ప్రాజెక్టుల్లో విభిన్నమైన పాత్రలు పోషించిన తమన్నా.. ప్రస్తుతం 'రాగిణి 3'తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ హారర్ చిత్రానికి సంబంధించిన షూటింగ్ 2026 జూలైలో ప్రారంభమైంది. 2027లో విడుదల చేయాలని చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు, ఏక్తా కపూర్ 'ది డర్టీ పిక్చర్ 2'ను రూపొందిస్తున్నట్లు ప్రకటించడంతో ఈ సినిమాపైనా ఆసక్తి పెరిగింది. అయితే ఇందులో తమన్నా నటించనున్నారనే వార్తకు ఇంకా అధికారిక ధ్రువీకరణ లేదు.మారుతున్న ప్రేక్షకుల అభిరుచులకు అనుగుణంగా కథలను ఎంచుకుంటున్న తమన్నా.. గ్లామర్‌తో పాటు నటనకు ప్రాధాన్యమున్న పాత్రలపై దృష్టి సారిస్తున్నారు. కొత్త తరహా కథలతో ఆమె ఎలాంటి విజయాలు అందుకుంటారో చూడాలి.

ఆ నలుగురు స్టార్ హీరోల ఫ్యాన్స్‌కి బిగ్ గుడ్‌న్యూస్

లీవుడ్‌లో దసరా సందడి కనిపిస్తోంది. బాక్సాఫీస్ వద్ద పలు సినిమాలు సందడి చేస్తున్న విషయం తెల్సిందే. దసరా సెలవులను సద్వినియోగం చేసుకోవడం కోసం చాలా సినిమాలు విడుదల అయ్యాయి. అందులో కొన్ని సినిమాలను తెలుగు ప్రేక్షకులు తిరస్కరిస్తే, కొన్ని సినిమాలకు బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు నమోదు అవుతున్నాయి. మొత్తానికి టాలీవుడ్ బాక్సాఫీస్ కళకళలాడుతోందని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దసరాకు స్టార్ హీరోల సినిమాలు, సూపర్ స్టార్ హీరోల సినిమాలు రాలేదు. అయినా కూడా ప్రేక్షకులు వచ్చిన సినిమాలను చూస్తూ దసరా పండుగ చేసుకునేందుకు సిద్ధం అయ్యారు. ఇక దసరా పండుగ సందర్భంగా స్టార్ హీరోల సినిమాల నుంచి కీలక అప్‌డేట్స్ వస్తాయని ఆయా హీరోల అభిమానులు, మీడియా వర్గాల వారు, ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

ప్రభాస్ ఫౌజీ, స్పిరిట్ సినిమాల అప్‌డేట్స్...

ముఖ్యంగా ప్రభాస్ నటించిన ఫౌజీ, స్పిరిట్ సినిమాలకు సంబంధించిన అప్‌డేట్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ ఏడాదిలో ప్రభాస్ నుంచి ఒక సినిమా వస్తుందని అభిమానులు ఎదురు చూస్తున్నారు. దసరా లేదా దీపావళి వరకు ప్రభాస్ సినిమాలకు సంబంధించిన కీలక అప్‌డేట్స్ ను ఇచ్చేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు. ఇటీవలే ప్రభాస్ స్పిరిట్ సినిమా వచ్చే ఏడాది దీపావళికి విడుదల కాబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. అయితే ఫౌజీ సినిమా విషయంలో క్లారిటీ రావాల్సి ఉంది. దసరా లేదా దీపావళి సందర్భంగా ప్రేక్షకులకు ఆ సినిమా అప్‌డేట్ ఇస్తే తప్పకుండా మంచి రీచ్ ఉంటుంది అనే అభిప్రాయం ను వ్యక్తం చేస్తున్న వారు చాలా మంది ఉన్నారు. అందుకే ప్రభాస్ రెండు సినిమాల అప్‌డేట్స్(టీజర్/పోస్టర్స్) అతి త్వరలోనే రానున్నాయి.

రంగస్థలం తర్వాత చరణ్-సుకుమార్ కాంబో మూవీ...

ఇక రామ్ చరణ్, సుకుమార్ కాంబోలో రూపొందుతున్న సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన సైతం ఇదే ఏడాది వస్తుందని తెలుస్తోంది. రామ్ చరణ్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో గతంలో రంగస్థలం సినిమా వచ్చిన విషయం తెల్సిందే. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకోవడం మాత్రమే కాకుండా రామ్ చరణ్‌కి మంచి పేరును తెచ్చి పెట్టింది. ఇక సుకుమార్ దర్శకత్వంలో ఆ తర్వాత వచ్చిన పుష్ప రికార్డ్‌ల వర్షం కురిపించింది. పాన్ ఇండియా రేంజ్‌లో పుష్ప సినిమాను విడుదల చేయడం జరిగింది. అక్కడ ఇక్కడ అనే తేడా లేకుండా అన్ని చోట్ల పుష్ప ప్రభంజనం కనిపించింది. అందుకే రామ్ చరణ్‌తో సుకుమార్ చేయబోతున్న సినిమాను సైతం పాన్ ఇండియా రేంజ్‌లో ప్రేక్షకులు అలరిస్తారనే నమ్మకం వ్యక్తం అవుతుంది. ఆ సినిమా తాలూకు అప్‌డేట్ ను మరికొన్ని రోజుల్లోనే సుకుమార్ అండ్ టీం నుంచి వినబోతున్నాం. మైత్రి మూవీ మేకర్స్ వారు అందుకోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎన్టీఆర్, అల్లు అర్జున్‌ల సినిమాల అప్డేట్స్...

ఎన్టీఆర్, అల్లు అర్జున్‌ల సినిమాలకు సంబంధించిన కీలక అప్‌డేట్స్ సైతం అతి త్వరలోనే రాబోతున్నట్లు తెలుస్తోంది. చాలా గ్యాప్ తర్వాత ఎన్టీఆర్ డ్రాగన్ షూట్‌లో పాల్గొంటున్నాడు. దసరా కి ప్రత్యేకంగా సర్‌ప్రైజ్ చేయాలనే ఉద్దేశంతో దర్శకుడు ప్రశాంత్ నీల్ వీడియోను రెడీ చేయిస్తున్నట్లు తెలుస్తోంది. పండుగకి ఒక మంచి పోస్టర్ విడుదల చేయడంతో పాటు, సినిమా విడుదల తేదీ, ఇతర విషయాలకు సంబంధించిన వివరాలను క్లారిటీగా చెప్పే అవకాశం ఉంది. కనుక అతి త్వరలోనే ఎన్టీఆర్ ఫ్యాన్స్ కి డ్రాగన్ యూనిట్ నుంచి పెద్ద సర్‌ప్రైజింగ్ న్యూస్ రావడం కన్ఫర్మ్ అయింది. ఎన్టీఆర్-నీల్ కాంబో డ్రాగన్ సినిమా పాన్ ఇండియా రేంజ్‌ను మించి విడుదల కాబోతున్నట్లుగా చెబుతున్నారు. కనుక సినిమా అప్‌డేట్ వస్తుంది అంటే కచ్చితంగా ఫ్యాన్స్ కి పెద్ద గుడ్ న్యూస్ కాదా మరి అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు అంటున్నారు.

అల్లు అర్జున్, అట్లీ కాంబోలో రూపొందుతున్న 'రాకా' సినిమా అప్‌డేట్ కోసం అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. హాలీవుడ్ రేంజ్ మూవీ అంటూ రాకా గురించి ప్రముఖంగా చర్చ జరుగుతోంది. కనుక రాకా సినిమా నుంచి వచ్చే అప్‌డేట్ కి పాన్ ఇండియా రేంజ్‌లో క్రేజ్ ఉంటుంది. అల్లు అర్జున్ ఫ్యాన్స్ కి అతి త్వరలోనే ఆ రేంజ్ సర్‌ప్రైజ్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఒక వైపు రాకా సినిమాతో బిజీగా ఉన్నప్పటికీ అల్లు అర్జున్ నుంచి అతి త్వరలోనే కొత్త సినిమా అప్‌డేట్ వస్తుందనే వార్తలు వస్తున్నాయి. అది కూడా ఈ రెండు మూడు నెలల్లోనే ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. అల్లు అర్జున్ కొత్త సినిమా దర్శకుడు ఎవరు, ఇతర అప్‌డేట్స్ ఏంటీ అనేది ఇదే ఏడాది చివరి వరకు వెల్లడి అయ్యే అవకాశాలు ఉన్నాయి. కనుక అల్లు అర్జున్ ఫ్యాన్స్ కి కూడా అతి త్వరలోనే రెండు బిగ్ గుడ్ న్యూస్ వినిపించే అవకాశాలు ఉన్నాయి. మొత్తానికి నలుగురు స్టార్ హీరోలు వచ్చే ఏడాది బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ ఏడాదిలో ఈ స్టార్ హీరోల ఫ్యాన్స్ కోసం బిగ్ అప్‌డేట్స్ వదలబోతున్నారు.

నమన్ ధీర్ విధ్వంసం.. న్యూజిలాండ్‌పై భారత్ సంచలన విజయం

ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి భారత్

ఓపెనర్లు సంజు శాంసన్, అభిషేక్ శర్మ అదిరిపోయే ఆరంభం

226 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించిన భారత్

15 బంతుల్లోనే 42 పరుగులు చేసి మ్యాచ్ స్వరూపాన్ని మార్చేసిన నమన్ ధీర్

కీలక ఇన్నింగ్స్ ఆడిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్

న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టీ20లో టీమిండియా నాలుగు వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని అందుకుంది. క్రైస్ట్‌చర్చ్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో 226 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ మరో రెండు బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. ఒక దశలో వరుస వికెట్లతో ఒత్తిడిలో పడిన భారత జట్టును చివర్లో నమన్ ధీర్ తన మెరుపు బ్యాటింగ్‌తో గెలుపు తీరాలకు చేర్చాడు. కేవలం 15 బంతుల్లోనే 42 పరుగులు చేసి మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ 1--0 ఆధిక్యంలోకి వెళ్లింది. భారత్ ఛేదనలో ఓపెనర్లు సంజు శాంసన్, అభిషేక్ శర్మ అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు కేవలం 5.5 ఓవర్లలోనే 93 పరుగులు జోడించారు. అభిషేక్ 12 బంతుల్లో 29 పరుగులు చేసి మైకేల్ బ్రేస్‌వెల్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ తర్వాత సంజు శాంసన్ 33 బంతుల్లో 67 పరుగులు చేసి మిచెల్ శాంట్నర్ బౌలింగ్‌లో వికెట్ కోల్పోయాడు. తిలక్ వర్మ 11 బంతుల్లో 6 పరుగులు చేసి బ్రేస్‌వెల్‌కు చిక్కగా, ఇషాన్ కిషన్ 3 బంతుల్లో ఒక్క పరుగు చేసి శాంట్నర్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. దీంతో భారత్ 122 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అక్షర్ పటేల్ 14 బంతుల్లో 24 పరుగులు చేసి లాకీ ఫెర్గూసన్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ సమయంలో శ్రేయస్ అయ్యర్ కీలకంగా నిలిచి పరుగులు సాధించగా, చివర్లో నమన్ ధీర్ 15 బంతుల్లో 42 పరుగులతో విధ్వంసం సృష్టించాడు. దాంతో, భారత్ 19.4 ఓవర్లలో 230/6తో లక్ష్యాన్ని ఛేదించింది. అంతకుముందు టాస్ గెలిచిన భారత్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. న్యూజిలాండ్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 225 పరుగులు చేసింది. ఆ జట్టు ఓపెనర్లు టిమ్ సీఫర్ట్ 17 బంతుల్లో 24, ఫిన్ అలెన్ 24 బంతుల్లో 45 పరుగులతో వేగంగా ఆడారు. సీఫర్ట్‌ను మయాంక్ యాదవ్ ఔట్ చేయగా, అలెన్‌ను అక్షర్ పటేల్ పెవిలియన్‌కు పంపాడు. డారిల్ మిచెల్ 19 బంతుల్లో 28 పరుగులు చేసి అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ తర్వాత గ్లెన్ ఫిలిప్స్ భారత బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 40 బంతుల్లో 82 పరుగులతో అజేయంగా నిలిచాడు. బెవన్ జాకబ్స్ 16 బంతుల్లో 31 పరుగులు చేశాడు. మైకేల్ బ్రేస్‌వెల్ 6 బంతుల్లో 7 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. భారత బౌలింగ్‌లో మయాంక్ యాదవ్ 40 పరుగులిచ్చి ఒక వికెట్, అర్ష్‌దీప్ సింగ్ 45 పరుగులిచ్చి ఒక వికెట్, అక్షర్ పటేల్ 51 పరుగులిచ్చి ఒక వికెట్ సాధించారు. భారీ అంచనాల మధ్య జట్టులో చేరిన భువనేశ్వర్ కుమార్ నాలుగు ఓవర్లలో 49 పరుగులిచ్చాడు. ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. నితీశ్ కుమార్ రెడ్డి కూడా నాలుగు ఓవర్లలో 40 పరుగులు సమర్పించుకున్నాడు. భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో సంజు శాంసన్ అందించిన మెరుపు ఆరంభం, శ్రేయస్ అయ్యర్ పోరాటం, నమన్ ధీర్ చివరి దశలో చూపిన దూకుడు భారత్ విజయానికి ప్రధాన కారణాలయ్యాయి. ఈ గెలుపుతో టీమిండియా ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో శుభారంభం చేసింది.

ఆసియా పారా గేమ్స్‌లో భారత్‌కు మరో స్వర్ణం.. అంజనాబెన్‌కు గోల్డ్, జయంతికి సిల్వర్!

జపాన్‌లోని ఐచి-నాగోయా వేదికగా జరుగుతున్న ఆసియా పారా గేమ్స్ 2026 లో భారత అథ్లెట్ల పతకాల జోరు కొనసాగుతోంది. ఈరోజు (అక్టోబర్ 22, గురువారం) జరిగిన మహిళల ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్లలో భారత రన్నర్లు తమ అద్భుతమైన వేగంతో ప్రత్యర్థులను వెనక్కి నెట్టి మరోసారి పోడియంపై త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా నిలిపారు. మహిళల 400 మీటర్ల ా47 ఈవెంట్‌లో భారత అథ్లెట్ అంజనాబెన్ బంబడియా స్వర్ణ పతకం సాధించగా, జయంతి బెహెరా రజత పతకాన్ని కైవసం చేసుకుని డబుల్ పోడియం విజయాన్ని అందించారు. అలాగే మహిళల 400 మీటర్ల ా12 విభాగంలో తేజల్‌బెన్ డామోర్ రజత పతకంతో మెరిసింది.

అంజనాబెన్ పసిడి.. జయంతికి సిల్వర్:

మహిళల 400 మీటర్ల T47 విభాగం రేసులో భారత రన్నర్లు మొదటి రెండు స్థానాలను ఆక్రమించి ఆధిపత్యాన్ని చాటారు.

అంజనాబెన్ గోల్డ్ మెడల్: రేసును అత్యంత విజయవంతంగా పూర్తి చేసిన అంజనాబెన్ 59.97 సెకన్ల వ్యవధిలోనే లక్ష్యాన్ని చేరుకుని స్వర్ణ పతకాన్ని ముద్దాడింది. నలుగురు అథ్లెట్లు పాల్గొన్న ఈ పోటీలో నిమిషంలోపు రేసును ముగించిన ఏకైక రన్నర్‌గా ఆమె నిలవడం విశేషం.

జయంతికి రజతం: భారత్‌కే చెందిన జయంతి బెహెరా 1:00.65 సెకన్ల టైమింగ్‌తో రెండో స్థానంలో నిలిచి రజత పతకం దక్కించుకుంది. థాయిలాండ్‌కు చెందిన శశిరవన్ ఇన్థాచోట్ (1:02.58 సెకన్లు) కాంస్య పతకం గెలుచుకుంది.

తేజల్‌బెన్ డామోర్‌కు రెండో పతకం:

దృష్టి లోపం ఉన్న అథ్లెట్లు పోటీపడే మహిళల 400 మీటర్ల ా12 కేటగిరీలో భారత అథ్లెట్ తేజల్‌బెన్ డామోర్ అద్భుత ప్రదర్శన కనబర్చింది.

ఈ రేసును 57.60 సెకన్లలో పూర్తి చేసిన తేజల్‌బెన్ రజత పతకాన్ని సొంతం చేసుకుంది.

ప్రస్తుత ఆసియా పారా గేమ్స్‌లో తేజల్‌బెన్‌కు ఇది రెండో పతకం కావడం విశేషం. దీనికి ముందు ఆమె 200 మీటర్ల ా12 ఈవెంట్‌లో కాంస్య పతకం సాధించింది.

శీతల్ దేవికి మరో స్వర్ణం.. వరుసగా రెండో గోల్డ్.. సింగపూర్ ఆర్చర్‌పై ఘన విజయం!

జపాన్‌లో జరుగుతున్న ఆసియా పారా గేమ్స్ 2026 2026) లో భారత స్టార్ ఆర్చర్, కాళ్లలో విల్లంబులు ఎక్కుపెట్టే అద్భుత ప్రతిభాశాలి శీతల్ దేవి తన అసాధారణ ఫామ్‌ను కొనసాగిస్తోంది. ఒకాజాకి చుఓ సోగో పార్క్ కాంప్లెక్స్‌లో ఈరోజు (2026, అక్టోబర్ 22, గురువారం) జరిగిన మహిళల కాంపౌండ్ ఇండివిజువల్ (ఈవెంట్ ఫైనల్లో శీతల్ దేవి అద్భుత కమ్‌బ్యాక్‌తో స్వర్ణ పతకాన్ని సాధించింది. టోమన్ కుమార్‌తో కలిసి కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో పసిడి పతకం గెలిచిన కొన్ని గంటల వ్యవధిలోనే బరిలోకి దిగిన 19 ఏళ్ల శీతల్ దేవి, సింగపూర్ అథ్లెట్ అలీమ్ నూర్ షాహిదాను 142-139 తేడాతో ఓడించి రికార్డు స్థాయిలో రెండో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ హోరాహోరీ ఫైనల్ మ్యాచ్ ప్రారంభంలో శీతల్ దేవి తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంది. తొలి రెండు రౌండ్ల ముగిసేసరికి సింగపూర్ ఆర్చర్ అలీమ్ ఏకంగా 4 పాయింట్ల ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. కానీ శీతల్ ఏమాత్రం పట్టుదలను కోల్పోలేదు.. తదుపరి రెండు రౌండ్లలో వరుసగా ఆరు 10లు (మూడు ంం తో సహా) ఎక్కుపెట్టి బుల్‌సైను తాకింది. దీంతో రెండు రౌండ్ల వ్యవధిలోనే 2 పాయింట్ల ఆధిక్యంలోకి వెళ్ళింది.

ఒత్తిడిని జయించి స్వర్ణ జయభేరి:

చివరి మూడు బాణాలలో శీతల్ మూడు 9 పాయింట్లతో మొత్తం 27 పాయింట్లు సాధించింది. ఒత్తిడిలో బరిలోకి దిగిన సింగపూర్ క్రీడాకారిణి అలీమ్ 9, 8, 9 పాయింట్లతో కేవలం 26 పాయింట్లు మాత్రమే సాధించగలిగింది. దీంతో 142-139 తేడాతో శీతల్ దేవి వరుసగా రెండో ఆసియా పారా గేమ్స్‌లోనూ పసిడిని కైవసం చేసుకుంది.

ప్రస్తుత గేమ్స్‌లో శీతల్ ఖాతాలో 3 పతకాలు:

కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్: స్వర్ణ పతకం (గోల్డ్)

కాంపౌండ్ ఇండివిజువల్: స్వర్ణ పతకం (గోల్డ్)

మహిళల డబుల్స్: రజత పతకం (ఒడిశాకు చెందిన నాలుగు అవయవాలు లేని పాయల్ నాగ్‌తో కలిసి)

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776